
ఆంధ్రజ్యోతి



సోమశిలలో 12.948 టీఎంసీల నిల్వ

అనంతసాగరం, మార్చి 14: సోమశిల పూర్తిసామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా గురువారం నాటికి జలాశయంలో 12.948 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 1600, ఉత్తరకాలువకు 600, దక్షిణ కాలువకు 450 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.



'సంక్షేమ'లో సంక్షోభం

నెల్లూరు (హరనాథపురం), మార్చి 14 : జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్లు ఉన్నాయి. వీటన్నింటిలో విద్యార్థుల సంఖ్య ఎక్కువగానే ఉంది. వీటికి భోజన బిల్లులు రూ.కోట్లలోనే పెండింగ్‌లో ఉన్నాయి. నా ఎస్సీలు, నా బీసీలు, నా ఎస్టీలు అని ప్రగల్భాలు పలికే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి హాస్టళ్ల విద్యార్థుల సంక్షేమాన్ని గాలి కొదిలేశారు. డైట్ బిల్లుల చెల్లింపునకు గ్రీన్ చానల్ ఉందని ప్రకటించినా అమలుకు నోచుకోవడం లేదు. పైగా బిల్లులు ట్రెజరీకి వెళ్లినా అవి ఆమోదానికి నోచుకోవడం లేదు.

● ఎస్సీ హాస్టళ్లకు రూ.4.3 కోట్లు

జిల్లాలో 73 ఎస్సీ హాస్టళ్లు ఉండగా, 6వేల మందికి పైబడి విద్యార్థులు చదువుతున్నారు. అయితే, ఈ హాస్టళ్లకు ఆరు నెలలుగా మెనూ బిల్లుల చెల్లింపులు ఆగిపోయాయి. ఒక్కో హాస్టల్‌కు నెలకు రూ.6లక్షల వరకు బిల్లుల బకాయిలు ఉన్నాయి. ఈ లెక్కన 73 హాస్టళ్లకు రూ.4.3 కోట్ల వరకు బిల్లులు పెండింగ్ ఉంది. పిల్లలు ఇబ్బందులు దృష్టిలో పెట్టుకుని హాస్టల్ నిర్వాహకులు అప్పులకు సరుకులు తెచ్చి కాలం వెళ్లదీస్తున్నారు.

● 15 ఎస్టీ గురుకులాలు

జిల్లాలో 15 గిరిజన సంక్షేమ గురుకులాలు ఉండగా, 3వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ హాస్టళ్లకు కూడా భోజన బిల్లుల చెల్లింపులు ఆగిపోయాయి. కనీసం కాస్మెటిక్ చార్జీల చెల్లింపులూ లేవు. సుమారు రూ.1.5కోట్ల వరకు పెండింగ్ ఉంది. జిల్లా కేంద్రమైన నెల్లూరులో ముస్లిం మైనార్టీ గురుకుల పాఠశాలలో 210 మంది విద్యార్థులు ఉన్నారు. వీరికి భోజన బిల్లులు, కాస్మెటిక్ చార్జీల బిల్లులకు ఆరు నెలలుగా చెల్లింపులు జరగలేదు. రూ.12 లక్షల వరకు ఈ ఒక్క పాఠశాలకే బిల్లుల చెల్లింపులు ఆగిపోయాయి. అంతేకాదండోయ్.. ఈ పాఠశాల అధికారులు, సిబ్బందికి ఆరు నెలలుగా జీతాలు కూడా ఆగిపోయి ఉన్నాయి. సుమారు రూ.15 లక్షల వరకు జీతాల పెండింగ్ ఉంది.

● బీసీ హాస్టళ్లకు రూ.2.5 కోట్లు

జిల్లాలో 98 బీసీ సంక్షేమ హాస్టళ్లు ఉండగా, 3600 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ హాస్టళ్లకు సుమారు రూ.2.5 కోట్లకు పైబడి బిల్లులు పెండింగ్ ఉంది.

● బియ్యం బిల్లులకు చెల్లింపులు లేవు

హాస్టళ్లకు డీలర్ల ద్వారా బియ్యం సరఫరా చేస్తారు. కిలోకు ఒక రూపాయి చొప్పున డీడీ రూపంలో సంక్షేమాధికారులు చెల్లించాలి. ఈ మొత్తం చెల్లింపులు కూడా సరిగా ఉండటం లేదు. వంట చేసేందుకు గ్యాస్ సిలిండర్లను కూడా సొంత జేబులో నుంచి పెట్టుకోవాల్సి వస్తోందని నిర్వాహకులు వాపోతున్నారు.

● అందని కాస్మెటిక్ చార్జీలు

హాస్టళ్లలోని విద్యార్థులకు కాస్మెటిక్ చార్జీలు కూడా 6 నెలలుగా చెల్లించడం లేదు. 3 నుంచి 6వ తరగతి చదివే బాలబాలికలకు ఒక్కొక్కరికి రూ.155, 7 నుంచి 10వ తరగతి వరకు చదివే బాలురకు ఒక్కొక్కరికి రూ.165, బాలికలకు రూ.175లను చెల్లించాల్సి ఉంది. ఈ చెల్లింపులు ఆరునెలలుగా లేకపోవడంతో హాస్టళ్ల నిర్వహణ తమ వల్లకాదంటూ సంక్షేమాధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా, బిల్లుల వ్యవహారంపై జిల్లా సంక్షేమాధికారి వెంకటయ్య మాట్లాడుతూ బీసీ సంక్షేమ హాస్టళ్ల మెనూ బిల్లులను ట్రెజరీకి పంపామని, త్వరలో మంజూరవుతాయని అన్నారు.

> ఆర్నెళ్లుగా అందని భోజన బిల్లులు
> అప్పు చేసి సరుకుల కొనుగోలు
> కాస్మెటిక్ చార్జీల చెల్లింపులకూ బ్రేక్
> లబోదిబోమంటున్న హెచ్‌డబ్ల్యూవోలు

> సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థుల సంక్షేమాన్ని గాలికొదిలేశారు. ప్రభుత్వ వసతి గృహాల నిర్వహణపై పూర్తిగా అలసత్వం అలముకొంది. కనీసం ఒళ్లు రుద్దుకొనే సబ్బులు కొనుక్కొనే పరిస్థితి కూడా హాస్టళ్లలో లేదంటే ఎంత దయనీయంగా ఉందో అర్థమవుతుంది. ఆరు నెలలుగా భోజన బిల్లులు చెల్లించకపోవటంతో హాస్టళ్ల వెల్ఫేర్ అధికారులే అప్పులు చేసి మరీ విద్యార్థుల ఆకలి తీరుస్తున్నారు.



ఆనం రామనారాయణరెడ్డి | ఇంటూరి నాగేశ్వరరావు | వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి | లక్ష్మీసాయిప్రియ

యుద్ధానికి సిద్ధం

- ఆత్మకూరుకు ఆనం, కందుకూరుకు ఇంటూరి, కోవూరుకు ప్రశాంతి రెడ్డి
- సర్వేపల్లి మినహా అన్ని స్థానాలకు టీడీపీ అభ్యర్థుల ఖరారు
- వెంకటగిరికి కురుగొండ్ల లక్ష్మీసాయిప్రియ

నెల్లూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లా నుంచి ఎన్నికల బరిలో తలపడనున్న టీడీపీ అభ్యర్థులు దాదాపుగా ఖరారయ్యారు. జిల్లా పరిధిలోని 8 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఒక్క సర్వేపల్లి మినహా మిగిలిన అన్ని స్థానాలకు టీడీపీ, జనసేన, బీజేపీల ఉమ్మడి అభ్యర్థులను ప్రకటించారు. గురువారం టీడీపీ అధిష్ఠానం విడుదల చేసిన రెండో జాబితాలో ఆత్మకూరు, కందుకూరు, కోవూరు నియోజకవర్గాలతోపాటు తిరుపతి- నెల్లూరు జిల్లాల ఉమ్మడి నియోజకవర్గం వెంకటగిరి అభ్యర్థి కూడా ఖరారయ్యారు. ఆత్మకూరుకు ఆనం రామనారాయణరెడ్డి, కందుకూరుకు ఇంటూరి నాగేశ్వరరావు, కోవూరుకు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి సతీమణి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పేర్లను ఖరారు చేశారు. తొలి జాబితాలో నెల్లూరు సిటీ, నెల్లూరు రూరల్, ఉదయగిరి, కావలి నియోజకవర్గ అభ్యర్థులను ప్రకటించిన విషయం తెలిసిందే. గురువారం విడుదల చేసిన రెండవ జాబితాతో నెల్లూరు పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలోని అన్ని స్థానాలకు అభ్యర్థులను ప్రకటించినట్లు అయ్యింది.

● ఒకరు పాత.. ముగ్గురు కొత్త

రెండవ జాబితాలో ప్రకటించిన ఆత్మకూరు, కోవూరు, కందుకూరు, వెంకటగిరి నియోజకవర్గాల అభ్యర్థుల్లో ఒకరు సీనియర్ కాగా మిగిలిన ముగ్గురు తొలిసారిగా అసెంబ్లీ ఎన్నికలకు పోటీ చేస్తున్నారు. ఆత్మకూరు నుంచి పోటీ చేస్తున్న ఆనం రామానారాయణరెడ్డి పరిచయం అక్కర్లేని నాయకుడు. సుదీర్ఘ కాలం ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేశారు. ఆత్మకూరు నుంచి మూడవసారి బరిలో నిలుస్తున్నారు. 2009లో ఆత్మకూరు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2014లో పరాజితులయ్యారు. ఆ తరువాత వైసీపీలో చేరి వెంకటగిరి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఇప్పుడు మూడవ సారి ఆత్మకూరు నుంచి పోటీ చేస్తున్నారు.

● కందుకూరులో ఇంటూరి నాగేశ్వరరావు తొలిసారిగా పోటీ చేస్తున్నారు. హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారంలో స్థిరపడిన ఈయన తెలుగుదేశం పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితుడై క్రియాశీల రాజకీయాల్లోకి వచ్చారు. రెండేళ్లుగా కందుకూరు టీడీపీ ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

● రాజ్యసభ సభ్యుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి సతీమణి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి. ఆమె తొలిసారిగా ఎన్నికల బరిలో దిగుతున్నారు. భర్త వీపీఆర్ టీడీపీ అభ్యర్థిగా నెల్లూరు పార్లమెంట్ స్థానానికి పోటీ చేస్తున్నారు. ఆ పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలోని కోవూరు నుంచి ఈమె అసెంబ్లీకి పోటీ చేస్తున్నారు. దక్షిణ భారతదేశంలోని టీడీపీ ఆలయాల పర్యవేక్షణ అధ్యక్షురాలిగా నాలుగేళ్లపాటు కొనసాగారు.

● నెల్లూరు-తిరుపతి జిల్లాల ఉమ్మడి నియోజకవర్గం వెంకటగిరి నుంచి మాజీ ఎమ్మెల్యే కురుగుండ్ల రామకృష్ణ రాజకీయ వారసురాలిగా ఆయన కుమార్తె కురుగుండ్ల లక్ష్మీసాయిప్రియ తొలిసారిగా ఎన్నికల బరిలో తలపడుతున్నారు. యువగళం పాదయాత్రలో లోకేష్ వెంట నియోజకవర్గం మొత్తం కలియతిరిగిన ఈమె తక్కువ రోజుల్లోనే నియోజకవర్గ ప్రజల్లో గుర్తింపు పొందారు. ఎవరూ ఊహించిన రీతిలో టీడీపీ అభ్యర్థిగా ఖరారయ్యారు. కురుగుండ్ల రాజకీయ వారసురాలిగా ప్రముఖ పారిశ్రామికవేత్త గంగాప్రసాద్ కోడలిగా తొలిసారిగా వెంకటగిరి నుంచి అసెంబ్లీకి పోటీ చేస్తున్నారు.

సర్వేపల్లిని వీడని ఉత్కంఠ

సర్వేపల్లి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి ఎవరనే విషయంలో ఇంకా సస్పెన్స్ కొనసాగుతోంది. ఇక్కడి నుంచి మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి టికెట్టు ఆశిస్తున్నారు. అయితే రెండవ జాబితాలో కూడా సర్వేపల్లి అభ్యర్థి పేరు ప్రకటించలేదు. రోజుకొక పేరుతో ఐవీఆర్‌ఎస్ బృందం సర్వే చేస్తోంది. ఒకవైపు రెండు జాబితాల్లోనూ సోమిరెడ్డి పేరు లేకపోవడం, మరోవైపు పలువురు నాయకుల పేర్లతో సర్వేలు నిర్వహిస్తుండటంతో సర్వేపల్లి అభ్యర్థి ఎవరనే విషయంలో మరి కొద్దిరోజుల పాటు సస్పెన్స్ తప్పదనిపిస్తోంది.



ఇంటూరికి స్వీటు తినిపిస్తున్న నారా లోకేష్

కందుకూరులో సస్పెన్స్‌కు తెర

కందుకూరు : నియోజకవర్గంలో తెలుగుదేశం అభ్యర్థి ఎవరనే సస్పెన్స్‌కు తెరపడింది. ఆ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ఇంటూరి నాగేశ్వరరావునే టీడీపీ, జనసేన, బీజేపీల ఉమ్మడి అభ్యర్థిగా టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు గురువారం ప్రకటించారు. తొలి జాబితాలోనే ఇంటూరి పేరును ప్రకటిస్తారని భావించగా ఆ జాబితాలో కందుకూరును పక్కన పెట్టడం అనేక ఊహాగానాలకు తెరలేచింది. ఈ సందేహాలకు నివృత్తిగా ఇంటూరి నాగేశ్వరరావునే అభ్యర్థిగా ఖరారుచేస్తూ ప్రకటన వెలువడటంతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు సంబరాల్లో మునిగిపోయారు. కాగా, రెండేళ్లుగా టీడీపీ ఇంఛార్జి బాధ్యతల్లో నాగేశ్వరరావు పార్టీ నిర్ధేశించిన అన్ని కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించటంతోపాటు నిత్యం ప్రజల్లో ఉంటూ వచ్చారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఇంటూరికి మద్దతుగా నిలవటం, కష్టపడ్డ వారికి న్యాయం చేయడం ద్వారా పార్టీ పట్ల కేడర్‌లో విశ్వసనీయతను కాపాడుకోవటం, యువకులను ప్రోత్సహించటం లక్ష్యంగా తర్జన భర్జనల అనంతరం నాగేశ్వరరావునే అభ్యర్థిగా ఖరారుచేసి అధిష్ఠానం ప్రకటన చేసినట్లు సమాచారం.

- ఎమ్మెల్యే మహీధరరెడ్డి అనుచరుల తీర్మానం
- రక్తికట్టిస్తున్న కందుకూరు వైసీపీ రాజకీయం



కందుకూరులో జరిగిన సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే అనుచరులు, అభిమానులు

ఆయన బరిలో నిలవాల్సిందే!

కందుకూరు, మార్చి 14 : 'కందుకూరులో సిటింగ్ ఎమ్మెల్యే మానుగుంట మహీధరరెడ్డికి టిక్కెట్ ఇవ్వకుండా వైసీపీ అధినేత జగన్ పెద్ద తప్పు చేశాడు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఆయన పోటీలో ఉండాల్సిందే, ఆయన గెలుపే లక్ష్యంగా మనమంతా పని చేద్దాం' అంటూ వైసీపీ నాయకులు ముక్తకంఠంతో తేల్చి చెప్పారు. కందుకూరులోని ఓ కల్యాణమండపంలో గురువారం జరిగిన సమావేశంలో పట్టణ ప్రముఖులు, వివిధ సామాజికవర్గాలకు చెందిన వారు పాల్గొన్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేసిన మహీధరరెడ్డే ప్రజాప్రతినిధిగా ఉండాలని ఈ ప్రాంత ప్రయోజనాలు నెరవేరాలంటే ఆయన పోటీలో ఉండి తీరాల్సిందేనని అభిప్రాయం వ్యక్తం చేశారు. మిగిలిన ప్రాంతాల వారిని కూడా కలుపుకుని బరిలో నిలిచేందుకు ఆయనపై ఒత్తిడి తేవాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో జనార్ధనస్వామి ఆలయ చైర్మన్ రావులకొల్లు బ్రహ్మానందం, విశ్రాంత తహసీల్దారు వెంకటేశ్వర్లు, దళిత నాయకుడు పాలేటి కోటేశ్వరరావు, పిడికిటి శంకర్, ఆర్యవైశ్య ప్రముఖులు గుర్రం శింగయ్య, కోట వెంకట నరసింహ్మం, శివ, మురారిశెట్టి శ్రీకాంత్, దామా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

- 42 రోజులపాటు అంగన్‌వాడీల ఆందోళన
- ఎట్టకేలకు దిగొచ్చిన ప్రభుత్వం
- 11 ఒప్పందాల్లో ఐదు మాత్రమే అమలు
- సమ్మె కాలానికి అందని జీతం
- రూ.9 కోట్ల వరకు బకాయిలు
- ఆర్థిక ఇబ్బందుల్లో కార్యకర్తలు

సమ్మె వేతనాలేవి జగనన్నా!?

నెల్లూరు (వైద్యం), మార్చి 14 : అంగన్‌వాడీల సమ్మె ఒక చారిత్రాత్మకం. తమ డిమాండ్ల సాధన కోసం 42 రోజుల సుదీర్ఘకాలం పాటు విధులకు దూరంగా ఉంటూ ఆందోళనబాటపట్టారు. ఎట్టకేలకు దిగివచ్చిన వైసీపీ ప్రభుత్వం అంగన్‌వాడీలతో పలు ఒప్పందాలు చేసుకుని హామీలు గుప్పించింది. సమ్మె కాలానికి కూడా వేతనాలు ఇస్తామని అంగీకరించింది. ఇది జరిగి ఒకటిన్నర నెల గడిచినా ఇప్పటి దాకా సమ్మె కాలానికి వేతనాలు అంద లేదు. ఫైనాన్స్ క్లియరెన్స్ పూర్తయినా ముఖ్యమంత్రి చాంబర్‌లోనే వేతనాల ఫైల్ ఉన్నట్టు సమా చారం. పెండింగ్ జీతం ఎప్పు డు వస్తుందోనని అంగన్‌వాడీ లు వేయికళ్లతో ఎదురుచూస్తు న్నారు. జిల్లాలో 2,934 కేంద్రా లు ఉండగా, 5,639 మంది అంగన్‌వాడీలు, హెల్పర్లు పని చేస్తున్నారు. అంగన్‌వాడీ టీచర్లకు రూ.11,500, హెల్పర్లకు రూ.7వేలు వేతనం ఇస్తున్నారు. సమ్మె కాలానికి అంటే 42 రోజుల వేతనం రూ.9 కోట్ల వరకు జిల్లాకు రావాల్సి ఉంది. గతేడాది డిసెంబరు 14న అంగన్‌వాడీలు సమ్మె చేపట్టగా జనవరి 24వ తేదీ వరకు కొనసాగింది.

కొన్నింటికే జీవోల విడుదల

కేవలం ఐదు హామీలకు మాత్రం ప్రభుత్వం జీవోలు విడుదల చేసింది. అంగన్‌వాడీలకు గ్యాట్యూటీ సంబంధించి కేంద్రానికి సిఫార్సు చేస్తామని, ఉద్యోగ విరమణ సమయంలో వర్కర్లకు రూ.50వేల నుంచి లక్ష రూపాయలకు పెంచుతున్నట్లు అంగీకరించి వాటిని అమలు చేస్తోంది. విధి నిర్వహణలో ఎవ రైనా చనిపోతే వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, వైఎస్సార్ బీమా, మట్టి ఖర్చులకు రూ. 20వేలు ఇస్తామని అంగీకరించింది.

● సమ్మె ఒప్పందాలు అమలేది!?

అంగన్‌వాడీల సమ్మె సందర్భంగా 11 డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచారు. వాటన్నిటి అమలు చేస్తామని ప్రభుత్వం అంగన్‌వాడీలతో ఒక అంగీకారానికి వచ్చింది. అయితే ప్రస్తుతం 5 డిమాండ్లు మాత్రమే అమలు అవుతున్నాయి. మిగిలిన వాటిని త్వరలో అమలు చేస్తామని ప్రభుత్వం కార్యాచరణ రూపొందించింది. అయితే నేటికి అవి అమలు కాలేదు. అంగన్‌వాడీ వేతనాల పెంపు మాత్రం జూలై నుంచి ఉంటుందని ప్రభుత్వం మెలిక పెట్టింది. గ్రేడ్-2 సూపర్‌వైజర్ పోస్టులకు పరీక్ష రాసి పెండింగ్‌లో ఉన్న 164 పోస్టుల భర్తీ ఏప్రిల్ నాటికి పూర్తి చేస్తామని హామీ ఇచ్చింది. అయితే, ఎన్నికల కోడ్ త్వరలో వచ్చే అవకాశం ఉన్నందున ఈ ప్రతిపాదన ముందుకు సాగే అవకాశం లేదు. 4 యాప్‌లు కలిపి ఒకే యాప్ రూపొందిస్తామని ప్రభుత్వం వెల్లడించినా ఇప్పటికీ అమలు కాలేదు. వేతనాలతో కూడిన మెడికల్ లీవ్, పోషణ మెనూ చార్జీల పెంపు, గ్యాస్ తదితర సమస్యలకు కమిటీ వేయిస్తామని హామీ ఇచ్చింది. ఇది ఎప్పటికి పూర్తవుతుందో తెలియని స్థితి నెలకొంది. మినీ అంగన్‌వాడీలను మెయిన్ సెంటర్లుగా చేస్తామన్న హామీ కూడా అమలుకు నోచుకోలేదు. అంగన్‌వాడీ హెల్పర్లకు పదోన్నతులు, 2017 నుంచి పెండింగ్‌లో ఉన్న టీఏ బిల్లు, ఉద్యోగ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచింది.



కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు (ఫైల్)



అమలు చేయకపోతే ఆందోళనకు దిగుతాం..

ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే మరోసారి ఆందోళనకు దిగు తాం. 42 రోజులపాటు సమ్మె చేశాం. మా సమస్యలు పరిష్కరిస్తామని ప్రభు త్వం అంగీకరించింది. ఇప్పటికే 15 రకాల పనులను అంగన్‌వాడీలు చేస్తున్నాయి. ఇంత పని ఒత్తిడిలోనూ అనేక ఇబ్బందులు పడుతున్నారు. సరకులన్నీ ఒకేసారి ఇవ్వాలని కోరుతున్నా అది అమలు కావటం లేదు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలి

- రెహనాబేగం, అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు



సమ్మెలో వేతనాలు రాలేదు..

అంగన్‌వాడీల సమ్మె కాలానికీ వేతనాలు ఇస్తామని ప్రభుత్వం అంగీకరించింది. అయితే ఇప్పటికీ రాలేదు. వాటిని త్వరగా అందించాలి. 11 డిమాండ్‌లను ప్రభు త్వం ముందుంచితే కేవలం ఐదింటికి మాత్రమే జీవోలు జారీ చేసింది. మిగిలిన వాటికి ఇంకా మోక్షం రాలేదు. త్వరగా ప్రభుత్వం పరిష్కరిస్తుందని భావిస్తున్నాం.

- సుజాత, అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (శుక్రవారం) : 6.26
సహరి (శనివారం) : 4.53

కిలో పొగాకు ధర రూ.233

కలిగిరి : స్థానిక పొగాకు వేలం కేంద్రానికి గురువారం రైతులు 309 పొగాకు బేళ్ల అమ్మకానికి తీసుకొచ్చారు. వేలంలో 12 కంపెనీల ప్రతినిధులు పాల్గొని 298 బేళ్ల కొనుగోలు చేశారు. సీఆర్-7, జంపింగ్‌లాట్స్-4 కారణాలతో 11 బేళ్ల తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.233, కనిష్ఠ ధర రూ.230, సగటు ధర రూ.230.06గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్ తెలిపారు.

ఏరంతా జల్లెడ పట్టి..
ఇసుకంతా కొల్లగొట్టి! 7

ఏరంతా జల్లెడ పట్టి..

ఇసుకంతా కొల్లగొట్టి!



మినగల్లు రీచ్‌లో టిప్పర్లకు ఇసుకను లోడ్ చేస్తున్న ఎక్స్‌కవేటర్లు



జొన్నవాడ రీచ్‌లో..

- జొన్నవాడ, మినగల్లు రీచ్‌లలో 'ప్రతిమ'దే ఇష్టారాజ్యం
- భారీ యంత్రాలతో 30 అడుగుల లోతున తవ్వకాలు
- వందల కొద్దీ ట్రాక్టర్లు, లారీలలో రవాణా
- గత అనుభవాలతో పాఠాలు నేర్వరి అధికారులు
- అడుగంటుతున్న భూగర్భజలం
- సాగు, తాగునీటికి పల్లెవాసుల అవస్థలు

బుచ్చిరెడ్డిపాళెం, మార్చి 14 : బుచ్చిరెడ్డిపాళెం మండలం మినగల్లు రీచ్ నుంచి జొన్నవాడ దాకా రాష్ట్ర ప్రభుత్వం అనుమతుల పేరుతో మొన్నటి వరకు జేపీ, ప్రస్తుతం ప్రతిమ కంపెనీ ఏరంతా జల్లెడ పట్టి ఇసుకతో పాటు తువ్విసుకనూ కొల్లగొడుతున్నారు. ఒక్క బుచ్చి మండలంలోని పెన్నానదిలోనే కాదు జిల్లా వ్యాప్తం గా ఇసుక తవ్వకాలు చేపడుతున్న ప్రతి రీచ్‌లోనూ ఇదే పరిస్థితిగా నెల కొంది. నిత్యం ఐదారు పెద్ద యంత్రాల తో 20 నుంచి 30 అడుగల లోతున ఇసుకను లోడేస్తు న్నారు. 150 నుంచి 250 ట్రిప్పులకుపైగా లారీలు, టిప్పర్లు, ట్రాక్టర్లతో సరిహద్దు దాటించి సొమ్ము చేసుకుం టున్నారు. ఇంత భారీస్థాయిలో ప్రకృతి సంపదను కొల్లగొడుతున్నా అధికారులు కళ్లుండి కబోదిలా వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇష్టప్రకారం తవ్వకాలు జరప డం వల్ల గత పెన్నానదికి వరద పోటెత్తి పొర్లుకట్టలు, పొలాలు, రోడ్లు కోతకు గురై కోవూరు నియోజకవర్గంలో ఎన్నో గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. బతుకుజీవుడా అంటూ ప్రజలు అరచేతి లో ప్రాణాలు పెట్టుకుని బయట పడ్డారు. గత అనుభవాలు నేర్వని పాలకులు, అధికారులు ఇప్పుడు కూడా పట్టించుకోకపోవడంతో ఇసుకాసురులు పేట్రేగిపోతున్నారు. అనుమతులు లేకున్నా నిర్భయంగా, నిరాటంకంగా చేపడుతున్న ఇసుక, తువ్విసుక తవ్వకాలతో 5నుంచి 8అడుగుల మేర భూగర్భ జలాలు బయటపడి, పెన్నా పరివాహక ప్రాంతాల్లోని బోర్లకు నీరు అందక రైతులు, ప్రజలు నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారు.



తవ్వకాల ధాటికి బయటపడిన భూగర్భజలం

● అందరికీ వాటాలు

జిల్లావ్యాప్తంగా పెన్నానదిలో చేపట్టే అక్రమ ఇసుక, తువ్విసుక తవ్వకాలు తిలాపాపం తలా పిడికెడు అన్నచందంగా మారింది. క్షేత్రస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ఏ నెలకానెల అక్రమ సంపాదనతో వాటాలుపెట్టుకుని రూ.కోట్లు గడిస్తున్నారు. టన్ను ఇసుకను రూ.475, ట్రాక్టర్ లోడు తువ్విసుకకు 1500, టిప్పర్లకు రూ.7,500 విక్రయించుకుంటున్నారు. ఇది చాలదన్నట్టు ప్రధాన రహదారి నుంచి రీచ్ వరకు బాటపేరుతో ఒక్కో టిప్పరు నుంచి 1000 నుంచి 2000, స్థానికేతర ట్రాక్టర్ల యజమాను నుంచి రూ.500 చేస్తున్నారు.

● గోరంత అనుమతితో..

పెన్నా నదిలో ఇసుక తవ్వకాలకు ఏస్థాయిలో అనుమతులు ఉన్నాయో సాక్షాత్తు అధికారులకే తెలియడం లేదు. ఈ ఏడాది జనవరి 9వ తేదీన మినగల్లు రీచ్‌లో సర్వే, భూగర్భజలాలు, రెవెన్యూ, మైనింగ్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఓ సర్వే చేశారు. జేపీ కంపెనీకి 5హెక్టార్లలో అనుమతులు ఇచ్చినట్టు, తాజాగా ప్రతిమ గ్రూపునకు 25 హెక్టార్లలో అనుమతుల కోసం సర్వే చేస్తున్నట్లు వెల్లడించారు. కానీ తీరం నుంచి 500 మీటర్ల వరకు తవ్వకాలు చేపట్టకూడదనే నిబంధనలు ఉన్నా పట్టించుకోలేదు. కాగా, నేటికీ సర్వే జరగలేదని స్థానిక అధికారులు చెబుతుండగా మరి అనుమతులు లేకున్నా రీచ్ ఎలా నిర్వహిస్తారనే విమర్శలు వస్తున్నాయి.

మా పొలం, బోర్లు కొట్టుకుపోయాయి



తీరం అంచుల దాకా ఇసుక కోసం 30 అడుగులలోతున తవ్వకాలు జరపడంతో 5 ఎకరాల పట్టాభూములు, పంటలు, బోర్లు వరద ప్రవాహానికి కోతకు గురై కొట్టు కుపోయాయి. మళ్లీ అక్కడే రీచ్ నిర్వహిస్తున్నారు. అడిగితే సమాధానం కూడా చెప్పడం లేదు. నష్టపోయినా ఏం చేయలేక కేసులు పెడతారనే భయం. ప్రభుత్వమే అలా చేస్తే ఇంకెవరికి చెప్పుకోగలం.

- శెట్టిపల్లి పెంచలమ్మ, మినగల్లు

మా ఊరు నాశనమైంది!




మినగల్లులో రీచ్ పుణ్యమా అంటూ నాకున్న 80 సెంట్ల భూమి, బోరు, పైరు కొట్టుకుపోయాయి. పట్టించుకున్న నాథుడే లేడు. నదిలో తీరందాకా తవ్వేయడంతో వ్యవసాయ, తాగునీటి బోర్లకు నీరు అందడం లేదు. రీచ్ వల్ల ఇప్పటికీ మా ఊరు నాశనమైంది. మాలాంటి పేదరైతులంతా తీవ్రంగా నష్టపోయినా అధికారులు పట్టించుకోకపోగా నేటికీ ఏట్లో ఇసుక తవ్వి తరలిస్తున్నారు.

- కూకటి పెంచలమ్మ, మహిళారైతు

సూపర్ మార్కెట్‌లో చోరీ

మనుబోలు, మార్చి 14: మండల కేంద్రంలోని కోదండరామాపురంలో శివ బాలాజీ సూపర్ మార్కెట్‌లో గురువారం వేకువజామున గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. బాధితుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు షాపుకు ఉన్న ఇనుప షట్టర్‌ను గడ్డపార సాయంతో వంచి లోపలకు ప్రవేశించి గల్లా పెట్టిలోని రూ.8500 నగదును దొంగిలించారు. పోలీసులు సీసీ టీవీ ఫుటేజ్‌లను పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



షట్టర్‌ను వంచిన దొంగలు

గుర్తుతెలియని వృద్ధురాలి మృతి

నెల్లూరు(క్రైం), మార్చి 14: గుర్తుతెలియని వృద్ధురాలు రైలుకిందపడి ఆత్మహత్యకు పాల్పడింది. నెల్లూరులోని సౌత్ రైల్వేస్టేషన్ వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న రైల్వే ఎస్ఐ జీ మాలకొండయ్య ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతురాలి ఆచూకీ తెలుసుకునే ఆధారాలు లభ్యం కాలేదని ఎస్ఐ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అగ్నిప్రమాదంలో గేదెల కొట్టం దగ్ధం

బుచ్చిరెడ్డిపాళెం, మార్చి 14: అగ్నిప్రమా దంలో గేదెల కొట్టం దగ్ధమైన సంఘటన బుచ్చిరెడ్డిపాళెంలోని రాఘవరెడ్డి కాలనీలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. గురువారం సాయంత్రం ఓ పార్టీకి చెందినవారు టపాసులు కాలుస్తుండగా నిప్పురవ్వలు కాలనీలో భాస్కర్ అనే రైతుకు చెందిన గేదెల కొట్టంపై పడి దగ్ధమైంది. గమనించిన స్థానికులు కొట్టంలోని గేదెలను తప్పించారు. సమాచారం ఇవ్వడంతో అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని యజమాని భాస్కర్ కోరుతున్నాడు. కాగా, టపాసులు కాల్చింది ఏ పార్టీవారనేది తెలియరాలేదు.



దగ్ధమవుతున్న గేదెల కొట్టం

జామాయిల్ తోటల కటింగ్ కాంట్రాక్టు పెంపు



మాట్లాడుతున్న డీఎఫ్‌వో చంద్రశేఖర్‌రావు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), మార్చి 14: జామాయిల్ తోటల కటింగు కాంట్రాక్టు అగ్రిమెంటును ఈ ఏడాది జూన్ వరకు మూడు మాసాలు పెంచేందుకు తీర్మానం చేశామని జిల్లా అటవీశాఖాధికారి ఆవుల చంద్రశేఖర్‌రావు తెలిపారు. ఫారెస్ట్ డెవలప్మెంట్ అథారిటీ సర్వసభ్య సమావేశం నగరంలోని జిల్లా అటవీశాఖ కార్యాల యంలో గురువారం జరిగింది. ఈ సందర్భంగా డీఎఫ్‌వో మాట్లాడుతూ సర్వసభ్య సమా వేశంలో వీఎస్ఎస్ వారితో చర్చించిన తర్వాత మూడు నెలలు జామాయిల్ తోటల కటింగు కాంట్రాక్టు అగ్రిమెంటు పెంచేందుకు తీర్మానం చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో గుంటూరు స్క్వాడ్ డీఎఫ్‌వో మారుతి ప్రసాదరావు, అధికారులు రాజశేఖర్‌బాబు, వనసంరక్షణ సమితి చైర్మన్లు, వైస్ చర్మన్‌లు పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో యువకుడి మృతి

వెంకటాచలం, మార్చి 14: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని తాటిపర్తిపాళెం రైల్వే గేటు సమీపంలో కృష్ణపట్నం పోర్టు రోడ్డుపై గురువారం రాత్రి జరిగింది. స్థానికులు కథనం మేరకు... ముత్తుకూరు మండలం పిడతాపోలూరు గ్రామానికి చెందిన ఉప్పు వెంకటేశ్వర్లు (27) మోటార్‌బైక్‌పై వివాహ నిశ్చితార్థ వేడుకల కోసం వెంకటాచలం మండలానికి వచ్చాడు. అయితే మోటార్‌బైక్‌పై పోర్టు రోడ్డులో వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో వెంకటేశ్వర్లు అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



మృతుడు వెంకటేశ్వర్లు (ఫైల్)

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	126
లేయర్ లైవ్	73
స్కిన్ చికెన్	224
స్కిన్‌లెస్	250
లేయర్	125

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 6260
వెండి కిలో ధర	రూ. 75,800
వెండి ఒక గ్రాము	రూ. 77.80

గంజాయి విక్రయాలపై దాడులు

నెల్లూరు(క్రైం), మార్చి 14: గంజాయి విక్రయాలపై చిన్నబజారు పోలీసులు దాడులు నిర్వహించి ఇద్దరు రౌడీ షీటర్లను అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరులోని కోటమిట్ట ప్రాంతానికి చెందిన మక్బూద్ అలియాస్ పెద్ద మక్బూద్, షాహుల్‌పై చిన్నబజారు పోలీసు స్టేషన్‌లో రౌడీషీట్లు ఉన్నాయి. వీరు కొంతకాలంగా కోటమిట్ట మెక్లిన్స్‌రోడ్డుకు చెందిన ఇబ్రహీం, రేవంత్‌తో కలిసి గంజాయి విక్రయాలు సాగిస్తున్నారు. వీరి కదలి కలపై పోలీసు అధికారులు నిఘా ఉంచారు. గురువారం ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్ మెక్లిన్స్‌రోడ్డులోని ఇబ్రహీం ఇంటికి సమీపంలో మక్బూద్, షాహుల్‌ను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.30 వేల విలువ చేసే 3 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మిగిలిన ఇద్దరి కోసం గాలిస్తున్నామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

ఈబీసీ నేస్తం నిధులు విడుదల



మెగా చెక్కు విడుదలలో కలెక్టర్, ఎమ్మెల్సీ, జడ్పీ చైర్‌పర్సన్ తదితరులు

నెల్లూరు (హరనాథపురం), మార్చి 14 : అగ్రవర్ణాలలో ఆర్థికంగా వెనుకబడిన పేదలకు సంబంధించి ప్రవేశ పెట్టిన ఈబీసీ నేస్తం నిధులను సీఎం గురువారం నంద్యాల జిల్లా బనగానపల్లి నుంచి విడుదల చేశారు. నెల్లూరు కలెక్టరేట్ ప్రాంగణంలోని తిక్కన భవన్ నుంచి కలెక్టర్ హరినారాయణన్, జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, ఎమ్మెల్సీ బల్లి కల్యాణ చక్రవర్తి, మేయర్ స్రవంతి వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మెగా చెక్కును విడుదల చేశారు. ఎమ్మెల్సీ కల్యాణ చక్రవర్తి మాట్లాడుతూ జిల్లాలో 29,042 మంది లబ్ధిదారులకు ఈబీసీ నేస్తం పథకం కింద రూ.43.56 కోట్లు విడుదల చేసినట్లు చెప్పారు. అగ్రవర్ణాల్లో ఆర్థికంగా వెనుకబడిన పేదలకు అండగా నిలవాలనే సంకల్పంతో ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం: కలెక్టర్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), మార్చి 14: రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా అవసరమైన రోడ్డు భద్రత చర్యలు సకాలంలో చేపట్టాలని కలెక్టర్ ఎం హరినారాయణన్ అధికారులను ఆదేశించారు. గురువారం వెబెక్స్ ద్వారా రోడ్డు భద్రత కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రోడ్డు భద్రత కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను తప్పకుండా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే గోల్డెన్ అవర్‌లో బాధితుడికి సహాయ సహకారాలు అందించి కాపాడిన వారికి ప్రోత్సాహకంగా రూ.5వేలు నగదు బహుమతి, సర్టిఫికెట్‌ను రిపబ్లిక్ డే రోజున అందించనున్నా మని, దీనిపై విస్తృతంగా ప్రచారం చేయాలని అధికారులకు సూచించారు. ప్రధాన రహదారుల్లో స్పీడ్ బ్రేకర్లకు పెయింటింగ్ వేయాలన్నారు. ఈ సమావేశంలో డీటీసీ చందర్, ఎన్‌హెచ్ పీడీ దేవేష్ గోయల్, ఆర్‌అండ్‌బీ డీఈఈ అనిల్‌కుమార్‌రెడ్డి, డీఎంహెచ్‌వో పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపు అమరజీవి జయంతి

నెల్లూరు(హరనాథపురం), మార్చి 14 : అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి కార్యక్రమాన్ని శనివారం నిర్వహిస్తున్నట్లు జిల్లా బీసీ సంక్షేమాధికారి వెంకటయ్య ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆ రోజు ఉదయం 9 గంటలకు నెల్లూరులోని ఆత్మకూరు బస్టాండ్ కూడలిలో ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి కలెక్టర్, జిల్లా అధికారులు పూలమాలతో నివాళులర్పిస్తారని తెలిపారు. అనంతరం ఉదయం 10 గంటలకు కలెక్టరేట్ తిక్కన భవన్‌లోనూ జయంతి కార్యక్రమం జరుగుతుందని వివరించారు.

సీఏఏకు వ్యతిరేకంగా నేడు నిరసన

నెల్లూరు (వైద్యం), మార్చి 14 : కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పౌరసత్వ సవరణ చట్టం బిల్లును తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ వామపక్ష, ప్రజా సంఘాలు శుక్రవారం నెల్లూరు నగరంలో నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ వెల్లడించారు. సీపీఎం జిల్లా కార్యాలయంలో సీపీఎం, సీపీఐ, సీపీఐ(ఎల్) పార్టీలు, పౌరహక్కుల సంఘం, అవాజ్, ఇన్సాఫ్ తదితర ప్రజా సంఘాలతో కలిసి గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పౌరసత్వ సవరణ బిల్లును రద్దు చేసేంత వరకు తమ పోరాటాలు కొనసాగిస్తామని తెలియచేశారు. సీపీఐ ఎంఎల్ నాయకుడు రాంబాబు మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా బీజేపీ మత రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. సీపీఐ నాయకుడు సిరాజ్ మాట్లాడుతూ సీఏఏకు టీడీపీ, వైసీపీ మద్దతు ప్రకటించటం సరికాదన్నారు. పౌరహక్కుల సంఘం జిల్లా కార్యదర్శి ఎల్లంకి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఏబీఎం కాంపౌండ్ నుంచి వీఆర్‌సీ వరకు నిర్వహించే నిరసన ప్రదర్శనలో లౌకిక, ప్రజాసంఘాల నేతలు పెద్ద ఎత్తున పాల్గొంటారని చెప్పారు. విలేకరుల సమావేశంలో అవాజ్ జిల్లా కార్యదర్శి షేక్ రషీద్, ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షుడు అజీజ్ తదితరులు పాల్గొన్నారు.



రోడ్డుపై ఖాళీ కొబ్బరి బోండాలు

● ప్రమాదాల బారిన వాహనదారులు

ఇందుకూరుపేట, మార్చి 14: మండలంలోని ఆరో మైలు సెంటర్ నుంచి మైపాడుకు వెళ్లే దారిలో రోడ్డుకి ఇరువైపులా తాగేసిన కొబ్బరి బోండాలు పడేయడంతో ప్రమాదాలకు గురికావాల్సి వస్తోందని ద్విచక్ర వాహనదారులు వాపోతున్నారు. ఇందుకూరుపేట మండలం నుంచి రోజూ నెల్లూరు నగరానికి ఆటోలలో కొబ్బరి బోండాలు తీసుకెళ్లి వ్యాపారం చేసుకుని తిరిగి ఇంటికి వచ్చేటప్పుడు ఖాళీ కొబ్బరి బోండాలను రోడ్డుకి ఇరువైపులా వేస్తున్నారు. దీంతో గుట్టలుగుట్టలుగా పేరుకుపోయిన ఖాళీ కొబ్బరి బోండాలలో వర్షపు నీరు చేరి దోమలు ఉత్పత్తి అవుతున్నా అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. అంతేకాకుండా కొబ్బరి బోండాలు రోడ్డుపై పడి ద్విచక్ర వాహన దారులు ప్రమాదాలకు జరిగిన సంఘటనలు చాలా ఉన్నాయి. ఇకనైనా అధికారులు స్పందించి ఖాళీ కొబ్బరి బోండాలు రోడ్డు పక్కన వేయకుండా చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

వేసవి వచ్చేసింది...

కలగానే కొత్త ఫైర్ స్టేషన్లు

- అప్రమత్తంగా లేకుంటే అగ్గికి బుగ్గే
- వెంటాడుతున్న సిబ్బంది కొరత
- భానుడి భగభగలు మొదలు
- ప్రజలకు అవగాహన కల్పించడంలో వెనుకబాటు

నెల్లూరు(క్రైం), మార్చి 14: వేసవి కాలం వచ్చేసింది... అప్రమత్తంగా లేకుంటే చిన్నపాటి నిర్లక్ష్యం పెను అగ్ని ప్రమాదంగా మారే అవకాశం ఉంటుంది. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న జిల్లాలో ఎన్నో ప్రైవేటు విద్యా సంస్థలు, వైద్యశాలలు, మాల్స్, ఫ్యాక్టరీలు, అపార్ట్‌మెంట్లు, గోదాములు అగ్ని మాపక శాఖ అనుమతులు లేకుండా, ఫైర్ సేఫ్టీ పరికరాలు ఏర్పాటు చేసుకోకుండానే వ్యాపారాలు సాగించేస్తున్నాయి. ఫలితంగా ఆయా ప్రాంతాల్లో అనుక్షణం అగ్ని ప్రమాదం ముప్పు పొంచి ఉంటోంది. అగ్గి ఎన్నో జీవితాలను బుగ్గి చేస్తుంది. కానీ అగ్నిమాపక శాఖ మాత్రం అగ్ని ప్రమాదాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ముందుకు రాలేదు. సిబ్బంది కొరత, నూతన ఫైర్ స్టేషన్లు ఏర్పాటు చేయక పోవడంతో ప్రమాదాలు జరిగినప్పుడు వెంటనే మంటలను అదుపు చేయడం కష్టతరంగా మారుతోంది.



కొత్త స్టేషన్లు రావు...ఉన్న సిబ్బంది సరిపోరు

జిల్లాలోని నెల్లూరు నగరం, పొదలకూరు, రాపూరు, ఆత్మకూరు, వింజమూరు, ఉదయగిరి, మర్రిపాడు, కావలి, కందుకూరు ప్రాంతాల్లో ఫైర్‌స్టేషన్లు ఉన్నాయి. వీటిలో సుమారుగా 100 మంది ఫైర్ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. అయితే ఆ సిబ్బంది సరిపోవకపోవడంతో 40 మంది హోంగార్డుల సేవ లను ఫైర్‌శాఖ ఉపయోగించుకుంటోంది. ఒక్కో స్టేషన్‌కు సుమారు 15 మంది సిబ్బంది ఉండాల్సి ఉండగా హోంగా ర్డులతో కలిపి 10 మంది మాత్రమే ఉంటున్నారు. ఈ క్రమంలో అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు సిబ్బంది కొరత బహిర్గతమవుతోంది. ఇక స్టేషన్ల విషయానికి వస్తే నెల్లూరు-2, బుచ్చిరెడ్డిపాళెం, వెంకటాచలం ప్రాంతాలకు ఫైర్ స్టేషన్లు కావాలన్న ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమయ్యాయి. దీనికితోడు ఫైర్ ఇంజన్లు సరిపోక ప్రమాదం జరిగినప్పుడు సకాలంలో వాహనాలు అక్కడికి చేరుకోలేకపోతున్నాయి. ఈ ఆలస్యం కారణంగా భారీగా ఆస్తి, ప్రాణ నష్టం వాటిల్లుతోంది.

అవగాహన ఏది ?

మార్చి నెల ప్రారంభం అయ్యిందంటే చాలు భానుడి భగభగలు మొదలవుతాయి. వేసవి తీవ్రత పెరిగే కొద్దీ అగ్నిప్రమాదాల సంఖ్య కూడా పెరుగుతుంటుంది. ఈ నేపథ్యంలో ప్రజలకు అవగాహన కల్పిస్తే ప్రమాదాలను నివారించలేకపోయినా ఆస్తి, ప్రాణ నష్టాన్ని తగ్గించే అవకాశం ఉంటుంది. అయితే అగ్నిమాపక శాఖ అధికారులు మాత్రం అగ్నిమాపక వారోత్సవాల సమయంలో హడావిడి చేసి ఆ తర్వాత చేతులు ఎత్తేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

అగ్నిమాపక వాహనాలు సిద్ధం చేశాం

జిల్లాలోని అన్ని అగ్నిమాపక కేంద్రాల్లో ఫైర్ ఇంజన్లను సిద్ధం చేశాము. వాహనంలోని అన్ని పరికరాలను, పంపులను వర్కింగ్ కండిషన్‌లో ఉంచాలని అధికారులను ఆదేశించాము. ఫైర్ కాల్స్, రిస్క్ కాల్స్ నందు అప్రమత్తంగా ఉండాలని సూచించాము. సిబ్బందికి అత్యవసర సమయంలో తప్ప సెలవులు మంజూరు చేయవద్దని, ఆఫ్ డ్యూటీ సిబ్బందిని అందుబాటులో ఉండాలని ఆదేశించాము.

- శ్రీనివాసరెడ్డి, డీఎఫ్‌వో

బీఎస్ఎఫ్ బలగాల కవాతు

నెల్లూరు(క్రైం), మార్చి 13: సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా నవాబు పేట పోలీసు స్టేషన్ పరిధిలో ఇన్‌స్పెక్టర్ ఎం బాబీ పర్యవేక్షణలో బీఎస్ఎఫ్ బలగాలు పలు ప్రాంతాల్లో గురువారం కవాతు నిర్వహించాయి. శెట్టిగుంట రోడ్డు, వీవర్స్ కాలనీ, నవాబుపేట సెంటర్, జలకన్య బొమ్మ, తడికల బజారు, స్టోన్‌హౌస్ పేట మీదుగా ఆత్మకూరు బస్టాండు వరకు బీఎస్ఎఫ్ బలగాలు స్థానిక పోలీసు లతో కలిసి కవాతు నిర్వహిం చాయి. ఇన్‌స్పెక్టర్ బాబీ మా ట్లాడుతూ ప్రశాంత వాతావ రణంలో ఎన్నికలు నిర్వహిం చేందుకు ప్రజలందరూ సహకరించాలని కోరారు.



కవాతు చేస్తున్న బీఎస్ఎఫ్ బలగాలు, పోలీసులు

వేసవి క్రీడాశిక్షణ శిబిరాలకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు (విద్య), మార్చి 14 : శాప్ ఆదేశాల మేరకు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ప్రతి ఏడాది వేసవి సెలవుల్లో నిర్వహించే క్రీడాశిక్షణ శిబిరాల నిర్వహణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎస్‌డీవో ఆర్‌కే యతిరాజ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా మే 1 నుంచి 31వతేదీ వరకు జరిగే శిబిరాలకు క్రీడాశిక్ష కులు, వ్యాయామ ఉపాధ్యాయులు, అంతర్జాతీయ, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్న సీని యర్ క్రీడా కారులు, క్రీడా సంఘాలు ఈనెల 25లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు డీఎస్‌ఏ కార్యాలయంలో గానీ, 8886228444 నెంబర్‌నుగానీ సంప్రదించాలని కోరారు.

నేడు 'ఆరోగ్యశ్రీ'లో మెరిట్ జాబితా

నెల్లూరు (వైద్యం), మార్చి 14 : ఆరోగ్యశ్రీ విభాగం పరిధిలో ఆరోగ్య మిత్రల నియామ కానికి సంబంధించి మెరిట్ జాబితాను శుక్రవారం అందుబాటులో ఉంచుతున్నట్లు ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ చంద్రశేఖర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆ జాబితాపై ఎలాంటి అభ్యం తరాలు ఉన్నా ఈ నెల 16న జీజీహెచ్‌లోని ఆరోగ్యశ్రీ జిల్లా కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు.

అటకెక్కిన స్వచ్ఛ సంకల్పం!

● నిర్వహణ నిధులు మరిచిన ప్రభుత్వం

● సచివాలయాల్లో మూలుగుతున్న పరికరాలు

ఉదయగిరి రూరల్, మార్చి 14: జగనన్న స్వచ్ఛ సంకల్పం పథకంలో భాగంగా సచివాలయాలలో పారిశుధ్యం మెరుగుదలకు ప్రభుత్వం వేల రూపాయలు వెచ్చించి ఫాగింగ్ యంత్రం, హైప్రెజర్ టాయిలెట్ క్లీనర్, రుతురుమాళ్ల దహనం, గ్రామాల్లో పిచ్చిమొక్కలు తొలగించే పరికరాలను అందజేసింది. ప్రస్తుతం వాటిని ఎప్పుడూ వినియోగించక పోవడంతో అవి కార్యాలయంలో మూలకు పరిమితం అయ్యాయి. వీటి నిర్వహణకు వైసీపీ ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవంతో.. పరికరాల వినియోగంపై సిబ్బందికి అవగాహన కల్పించకపోవడంతో స్వచ్ఛసంకల్పం లక్ష్యం అటకెక్కింది.

వస్తువుల వినియోగానికి అయ్యే ఖర్చు ఎంతంటే..

ప్రభుత్వం గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుదలకు పరికరాలు అయితే పంపిణీ చేసింది కాని నిర్వహణ నిధులు మాత్రం మరిచింది. దోమల నివారణకు ఫాగింగ్ యంత్రాన్ని వినియోగించాలంటే 15 లీటర్ల డీజల్, 5 లీటర్ల పెట్రోల్, మలాథియన్ అవసరం. మేజర్ పంచాయతీల్లో అయితే నిత్యం రూ.2500, చిన్న పంచాయతీల్లో రోజుకు రూ.1000లు వరకు ఖర్చు చేయాలి. గ్రామాల్లో రోడ్ల, నివాసాలు వెంట ఉండే పిచ్చిమొక్కలను తొలగించే యంత్రానికి రోజుకు 4 నుంచి 5 లీటర్ల పెట్రోల్ అవసరం. హైప్రెజర్ టాయిలెట్ క్లీనర్లను పాఠశాలలు, సచివాలయాలు, పీహెచ్‌సల్లో మరుగుదొడ్లను శుభ్రం చేయడానికి ఉపయోగిం చాలి. పంచాయతీల్లో పారిశుధ్య సిబ్బంది వాటిని వినియోగించాల్సి ఉంది. అయితే సిబ్బంది కొరత, వేతనాలు సకాలంలో చెల్లించకపోవడంతో వారు వాటితో పనిచేసేందుకు విముఖత చూపడం లేదు. యంత్రాలను కొన్ని నెలలుగా మూలనపడేయడంతో వాటిలో కొన్ని యంత్రాలు తుప్పు పట్టి ఎందుకు పనికిరాకుండా పోతున్నాయి. ఇప్పటికైనా అధికారులు సచివాలయాలకు అందజేసిన పరికరాలు సక్రమంగా వినియోగించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. కాగా ప్రభుత్వం సచివాలయాలకు అందజేసిన పారిశుధ్య పరికరాలను వినియోగించేలా చర్యలు చేపడతామని ఈ మేరకు ప్రతి పంచాయతీ కార్యదర్శికి సైతం ఆదేశాలు జారీ చేశామని ఎంపీడీవో ఈశ్వరమ్మ తెలిపారు.



మూలకు చేరిన ఫాగింగ్ యంత్రం



సచివాలయానికే పరిమితమైన పిచ్చిమొక్కలు తొలగించే యంత్రం

జీ.చెర్లోపల్లి, వడ్డిపాళెంలో రచ్చబండ

ఉదయగిరి రూరల్, మార్చి 14: జీ.చెర్లోపల్లి, వడ్డిపాళెం గ్రామాల్లో గురువారం నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు. ఆయన వెంట పార్టీ మండల కన్వీనర్ ఓబులరెడ్డి, వెంకటేశ్వ రరెడ్డి, పాల్గొన్నారు.

విజయసాయిరెడ్డిని కలిసిన మేకపాటి

ఉదయగిరి: జిల్లా వైసీపీ ఎంపీ అభ్యర్థి విజ యసాయిరెడ్డిని గురువారం నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి నెల్లూరులోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువా పుష్పగుచ్ఛంతో సత్కరించారు. ఆయన వెంట మేకపాటి అభినవ్‌రెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

అనంతసాగరం: గౌరవరం, కామిరెడ్డిపాడు, మంగుపల్లి గ్రామాల్లో గురువారం విజయీభవ యాత్రలో ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పాల్గొన్నారు. ఆయన వెంట ఎంపీపీ సంపూర్ణమ్మ పాల్గొన్నారు.

18 నుంచి ఒంటిపూట బడులు

ఉదయగిరి, మార్చి 14: ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు ఈనెల 18వ తేదీ నుంచి ఒంటిపూట బడులు నిర్వహించనున్నట్లు ఎంఈవో-2 తోట శ్రీనివాసులు గురువారం తెలిపారు. ఉదయం 7.45 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు తరగతులు నిర్వహించాలని హెచ్‌ఎంలకు సూచించామన్నారు. ఆరుబయట చెట్ల కింద తరగతులు నిర్వహించరాదని ఆదేశించారు.

ఎన్నికల నిబంధనలు తప్పనిసరి

ఉదయగిరి, మార్చి 14: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో సచివాలయ సిబ్బంది ఎన్నికల నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని మోడల్‌ఆఫ్‌కోడ్ కాంటాక్ట్ నోడ్ అధికారి ఈశ్వరమ్మ అన్నారు. గురువారం స్థానిక స్త్రీశక్తి భవనంలో 12 సచివాలయాల పరిధిలోని 17గ్రామ పంచాయతీ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుందని, వచ్చిన 24 గంటల్లో పంచాయతీ, సచివాలయాలు, కార్యాలయాల్లో రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు, ఫొటోలు, గోడ పత్రికలు, స్లోగన్లు తొలగించాలని, విగ్రహాలకు ముసుగులు వేయాలన్నారు.

సరస్వతిదేవికి ప్రత్యేక పూజలు

సంగం, మార్చి 14: అన్నారెడ్డిపాళెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులు సరస్వతిదేవి ప్రత్యేక పూజలు చేశారు. విద్యార్థులు పది పరీక్షలల్లో ఉత్తమ మార్కులు సాధించాలని ఉపాధ్యాయులు దీవించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు లక్ష్మీదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ప్రయాణికుడి మృతి

సంగం, మార్చి 14: కావలికి చెందిన ప్రభు అనారోగ్యంతో బాధపడుతూ వైద్యశాలకు వెళ్లేందుకు ఆర్టీసీ బస్సులో బయలుదేరాడు. మార్గమధ్యలో వైద్యం ఖర్చుల కోసం కలిగిరిలో దిగి కుమార్తె ఇంటికి వెళ్లి నగదు తీసుకుని వచ్చే క్రమంలో అలసటగా ఉంటే మార్గమధ్యలో సంగం తహసీల్దారు కార్యాలయం ఎదురుగా దిగి బల్లల మీద సేదతీరుతూ స్పృహతప్పి పడిపోయాడు. అతన్ని స్థానికులు వైద్యశాలకు తరలించగా మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. తల్లిదండ్రులు మృతదేహాన్ని స్వగ్రామం కావలికి తీసుకువెళ్లారు.

అందుబాటులో క్షయవ్యాధి పరీక్షలు

అనంతసాగరం, మార్చి 14: స్థానిక పీహెచ్‌సీలో క్షయవ్యాధి పరీక్షలకు సంబంధించిన ఆర్‌టీపీసీఆర్ యంత్రాన్ని గురువారం అందుబాటులోకి తెచ్చారు. ఇప్పటినుంచి ప్రజలకు క్షయ పరీక్షలు అందుబాటులోకి వస్తాయని వైద్యులు శ్రీకాంత్‌రెడ్డి, శ్రావణి తెలిపారు. కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ మీరాన్ పాల్గొన్నారు.

ప్రతిరోజు పౌష్టికాహారం తీసుకోవాలి

ఆత్మకూరు: మహిళలు, బాలింతలు, గర్భవతులు ప్రతిరోజూ పౌష్టికాహారం తీసుకోవాలని మహిమలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి పి.అనూష తెలిపారు. గురువారం వెన్నవాడ సచివాలయం పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ పక్వాడ్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. మహిళలు రాగిపిండి, బెల్లంతో చేసిన వేరుశనగముద్దలు, పెసరపప్పు పాయసం, తదితర వాటిని ప్రతి రోజు తీసుకోవడంతో ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నారాయణమ్మ, హెల్త్ సూపర్‌వైజర్ సైదా, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

ఆత్మకూరులో టీడీపీ శ్రేణుల ఉత్సాహం

ఆత్మకూరు: నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా మాజీ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేరు ఖరారు కావడంతో టీడీపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గురువారం పట్టణంలో టీడీపీ పట్టణ, రూరల్ అధ్యక్షులు తుమ్మల చంద్రారెడ్డి, సుంకర పెంచల చౌదరి ఆధ్వర్యంలో నేతలు, కార్యకర్తలు, ఆనం అభిమానులు ఆనందోత్సవ సంబరాలు జరుపుకున్నారు. బాణాసంచా కాల్చి మిఠాయిలు పంచి పెట్టారు. ఈ సందర్భంగా పలువురు టీడీపీ నేతలు మాట్లాడారు. ఆత్మకూరు నియో జకవర్గ అభివృద్ధి ప్రదాత ఆనం రామనారాయణరెడ్డి తిరిగి ఆత్మకూ రులో అత్యధిక మెజార్టీతో విజయం సాధించడం ఖాయమన్నారు.



మర్రిపాడు: కృష్ణాపురం సెంటర్‌లో కేట్ కట్ చేస్తున్న నాయకులు, కార్యకర్తలు



ఆత్మకూరు : ఆనందోత్సవాల్లో టీడీపీ నేతలు, కార్యకర్తలు

మర్రిపాడు: మండలంలో కార్యకర్తలు నాయకులు, ఆనం అభిమానులు సంబరాలు జరుపుకున్నారు. కృష్ణాపురం సెంటర్‌లో కేక్ కట్‌చేసి బాణాసంచా పేల్చి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ మండలాధ్యక్షుడు బంకా సుబ్బారెడ్డి, పెగళ్లపాడు మాజీ సర్పంచ్ శేషంబాబు, బ్రాహ్మణపల్లి రామకృష్ణారెడ్డి, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

సంగం: పార్టీ నేతలు, కార్యకర్తలు బాణాసంచి కాల్చి హర్షం వ్యక్తం చేశారు. టీడీపీ జిందాబాద్, ఆనం రామనారాయణరెడ్డి నాయకత్వం వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. అనంతరం మిఠాయిలు పంచి పెట్టారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు గుండ్లపల్లి శ్రీనివాసులు యాదవ్, బాణా శ్రీనివాసులురెడ్డి, కరుణాకర్‌రెడ్డి, షేక్‌బాబు పాల్గొన్నారు.

ఆశీర్వదించండి.. అభివృద్ధి చేసి చూపుతా : కాకర్ల

ఉదయగిరి రూరల్: సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు తనను ఆశీర్వదిస్తే నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసి చూపుతానని ఉదయగిరి టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి కాకర్ల సురేష్ తెలిపారు. గురువారం పట్టణంలోని దిలావర్‌భాయ్‌వీధి, షబ్బీర్ కాలనీల్లో నాయకులతో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. తొలుత ఖాన్‌షా వలి దర్గా, ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో సాగు, తాగునీటి కష్టాలు తీర్చడంతోపాటు పరిశ్రమలు స్థాపించి యువతకు ఉపాధి అవకాశాలు కల్పి స్తానన్నారు. ఫ్లోరిడ్‌ప్రాంత ప్రజలకు తాగునీరు అందించాలనే ఉద్దేశంతో టీడీపీ హయాంలో రూ.12 కోట్ల వ్యయంతో ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకాన్ని ప్రారంభించి 90శాతం పనులు పూర్తి చేసిందన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక పథకాన్ని మూలన పడేయడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ బయ్యన్న, మాజీ ఎంపీపీ చేజర్ల సుబ్బారెడ్డి, నాయకులు రియాజ్, అలీజాన్, సందానీ, ఖాదర్‌బాషా పాల్గొన్నారు.



దిలావర్‌భాయ్‌వీధిలో మహిళలను ఓట్లు అభ్యర్థిస్తున్న కాకర్ల

ఆనం, వేమిరెడ్డితోనే అభివృద్ధి

అనంతసాగరం: నియోజకవర్గ అభివృద్ధి ఆనం రామనారాయణరెడ్డి, పార్లమెంటు అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డితోనే సాధ్యమని గురువారం అనంతసాగరం టీడీపీ నాయకుడు పాతపాటి మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఆనం రామనాయణరెడ్డికి టీడీపీ టికెట్టు కెటాయించడంపై హర్షం వ్యక్తం చేశారు. టీడీపీ గెలుపు కోసం కార్యకర్తలు కృషి చేయాలని కోరారు.

ఘనంగా జనసేన ఆవిర్భావ దినం

ఉదయగిరి, మార్చి 14: నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి కాకర్ల సురేష్‌ను సమష్టిగా గెలిపించుకోవాలని జనసేన ఉదయగిరి ఇన్‌చార్జ్ భోగినేని కాశీరావు పిలుపు నిచ్చారు. జనసేన 11వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక బస్టాండ్ సెంట ర్‌లో జెండాను ఆవిష్కరించి కేక్ కట్ చేసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ప్రస్తుతం అధికార పార్టీ మెట్ట ప్రాంతా న్ని అభివృద్ధి చేయ లేదని దుయ్యబట్టారు. ప్రభుత్వం ఎన్నో అవినీతి, అక్రమాలకు పాల్పడిం దన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి అలూరి రవీంద్ర, వింజమూరు, సీతారా మపురం, ఉదయగిరి, కొండాపురం మండలాధ్యక్షులు బండారు సత్యనారాయణ, పోలిశెట్టి శ్రీనివాసులు, సురేంద్ర రెడ్డి, రాఘవేంద్రరావు, బండ్ల హరికృష్ణ పాల్గొన్నారు.



కలువాయి: కేక్ కట్ చేస్తున్న జనసేన నాయకులు

సీతారామపురం: మండలకేంద్రంలోని జనసేన కార్యాలయంలో పార్టీ నియోజకవర్గ నాయకులు బోగినేని కాశీరావు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఘనంగా ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బోగినేని కాశీరావు మాట్లాడుతూ టిడిపి, జనసేన ఉమ్మడి అభ్యర్థి కాకర్ల సురేష్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని జనసేన, టీడీపీ నాయకులు, కార్యకర్తలు కలసికట్టుగా రావాలని కోరారు. కార్యక్రమంలో పాలిశెట్టి శ్రీనివాసులు,కాశి రత్తయ్య, వితల నారాయణ, పిచెన్నయ్య, సురేంద్ర, అల్లూరి రవీంద్ర పాల్గొన్నారు.

కలువాయి: స్థానిక బస్టాండులో జనసేన ఆవిర్భావ దినోత్సవాన్ని జరుపుకున్నారు. కేక్ కట్ చేసి, బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో వీర మహిళ ప్రవలిక, జనసేన మండల పార్టీ అధ్యక్షులు పెరంకొండ మనోహర్, నాయకులు పువ్వాడి నరేష్, శ్రీహరి, రామకిషోర్, గణేష్, ఆంజనేయులు, తేజ, అనిల్ పాల్గొన్నారు.

మడపల్లి యువత సేవలు అభినందనీయం : ఆనం

చేజర్ల, మార్చి14: గ్రామాభివృద్ధికి నడుంకట్టి ఆదర్శంగా నిలుస్తున్న మడపల్లి యువసేన సభ్యులను మాజీమంత్రి ఆనం రామనారాయణ రెడ్డి బుధవారం రాత్రి సమావేశమయ్యారు. గ్రామ యువకులు మడపల్లి యువసేన గ్రూప్‌గా ఏర్పడి సమస్యలు పరిష్కరించడం ఎంతో అభినందనీయం అని కొనియాడారు. అనంతరం వైసీపీకి చెందిన పరుశురాం, రాఘవేంద్ర, మస్తాన్‌బాష, వినోద్, వెంకటాద్రి, భానుప్రకాష్, వంశీ, కొండయ్య, ప్రసాద్, బాలు తదితరులకు ఆనం టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నవకృష్ణ చౌదరి, సుధాకరరెడ్డి, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

పల్లెవాసుల దాహం తీర్చిన దాతలు

ఉదయగిరి రూరల్: లింగంనేనిపల్లి, కృష్ణారెడ్డిపల్లి, బిజ్జంపల్లి గ్రామాల ప్రజలు కొన్నిరోజులుగా తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయం గుర్తించిన దాతలు అంబరవపు బలరామిరెడ్డి, కొండా రాజారెడ్డి, బసిరెడ్డి తిరుపతిరెడ్డి, ఎంపీటీసీ కాకు విజయమ్మలు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. ప్రతిరోజు ఈ గ్రామాలకు వైఎస్‌ఆర్ సుజల స్రవంతి పథకం నీటిని సరఫరా చేసేందుకు ట్రాక్టర్‌కు డీజిల్, డ్రైవర్ వేతనం చెల్లించేందుకు ముందుకు వచ్చారు.

కిడ్నీ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఆత్మకూరు, మార్చి 14: కిడ్నీ వ్యాధులపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఆత్మకూరు ప్రభుత్వ జిల్లా వైద్యశాల సూపరింటెండెంట్ కె.శేషారత్నం తెలిపారు. స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో గురువారం నిర్వహించిన వరల్డ్ కిడ్నీ డే వేడుకలో పాల్గొని మాట్లాడారు. కిడ్నీ వ్యాధులు వచ్చిన తరువాత, రాకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో వైద్యశాల ఆర్‌ఎం డాక్టర్ ఉషాసుందరి, ఏవో శ్రీనివాసులరెడ్డి, ఆఫీస్ సూపరింటెండెంట్ కృష్ణకుమారి పాల్గొన్నారు.

వలేటివారిపాలెం, మార్చి 14: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల ప్రాగణంలో చేపట్టిన అదనపు తరగతి గదుల నిర్మాణం నిధుల్లేక అర్థంతరంగా నిలిచాలి. హైస్కూల్‌లో తరగతి గదుల కొరత తీవ్రంగా ఉండడంతో ప్రభుత్వం ముందుగా 8 అదనపు గదులను నాడు-నేడు రెండో విడతలో మంజూరు చేసింది. సుమారు రూ.90 లక్షలు మంజూరు కాగా 8 బదులు 5 గదులు మాత్రమే నిర్మించాలని ఉన్నతాధికారులు నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. దీంతో కాంట్రాక్టర్ పనులు ప్రారంభించారు. అయితే ఆ పనులు పిల్లర్ల దశలోనే నిలిచిపోయాయి. దీంతో అదనపు మంజూరయిన నిధులు ఇతర పాఠశాలలకు మళ్లించారు. ఇప్పటికైనా ప్రభుత్వం నిధులు విడుదల చేసి గదుల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పిల్లర్ల దశ దాటని తరగతి గదులు



పిల్లర్ల దశలోనే నిలిచిన అదనపు తరగతి గదుల నిర్మాణం

త్వరలో పనులు ప్రారంభిస్తాం : శిరీష ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ

తరగతి గదుల నిర్మాణానికి నిధులు రాక పనులు ఆలస్యమయ్యాయి. మంజూరయిన నిధులను వేరే పాఠశాలకు మళ్లించారు. మళ్లీ నిధులు మంజూరయ్యాయి త్వరలో పనులు ప్రారంభిస్తాం.

టికెట్ ఖరారుపై 'ఇంటూరి' అభిమానుల సంబరం

కందుకూరు : టీడీపీ, జనసేన, బీజేపీల ఉమ్మడి అభ్యర్థిగా ఇంటూరి నాగేశ్వరరావు పేరు వెలువడగానే ఆయన అభిమానులు సంబరాల్లో మునిగిపోయారు. బుధవారం రాత్రే ఇంటూరి మంగళగిరి చేరుకోగా, టికెట్ ఖరారైన వెంటనే పార్టీ ప్రధాన కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించిన నాగేశ్వరరావు గురువారం ఉదయం కందుకూరుకు తిరిగి వచ్చేశారు. మార్గమధ్యంలో పూర్వ ప్రకాశం, గుంటూరు జిల్లాల సరిహద్దులో జాతీయ రహదారిపై బొప్పూడి వద్ద ఆంజనేయస్వామి ఆలయంలో జిల్లా డెయిరీ మాజీ చైర్మన్ చల్లా శ్రీనివాసరావు తదితరులతో కలిసి పూజలు చేశారు. అనంతరం ఒంగోలు సమీపంలోని వల్లూరమ్మ అమ్మవారి ఆలయంలోను పూజలు నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు వాహనాలలో సింగరాయకొండ వద్దకు చేరుకుని ఇంటూరికి ఘనస్వాగతం పలికారు. అక్కడ నుంచి వాహన శ్రేణితో ర్యాలీగా కందుకూరుకు రాగా మార్గమధ్యంలో చల్లా స్వగ్రామమైన ఓగూరు వద్ద పార్టీ నాయకులు నాగేశ్వరరావును ఘనంగా స్వాగతించారు. కందుకూరులోను పెద్దఎత్తున వాహనాలు వెంటరాగా ప్రధాన వీధులలో ర్యాలీగా నాగేశ్వరరావు మహనీయుల విగ్రహాలకు నివాళులర్పించారు. అనంతరం కందుకూరు గ్రామదేవత అంకమ్మ అమ్మవారి ఆలయంలోనూ ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు.



కందుకూరు : ఇంటూరి నాగేశ్వరరావుకు స్వాగతం పలుకుతున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

లింగసముద్రం : కందుకూరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా ఇంటూరి నాగేశ్వరరావును ప్రకటించడంతో గురువారం తెలుగు తమ్ముళ్లు సంబరాలు చేసుకున్నారు. తెలుగు యువత మండల అధ్యక్షుడు అడపా రంగయ్య, గ్రామ కమిటీ అధ్యక్షుడు గాలంకి ప్రసాద్, ఉపాధ్యక్షుడు ఎస్ నారాయణ, ఇతర నాయకులు అర్థాకుల సత్యం, పెదసత్యం, దేవకి సుబ్రహ్మణ్యం తదితరులు బాణసంచా కాల్చి, స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా వారు స్థానిక వినాయకస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నాయకులు సీహెచ్ బాలకోటయ్య, జంపాల శివప్రసాద్, మైల రామకేశవులు, బీ శ్రీనివాసులు, సాదం శ్రీనివాసులు, అడపా కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నత శిఖరాలు

కావలి రూరల్, మార్చి14: విద్యతోనే ఉన్నత శిఖరాలకు చేరవచ్చని శ్రీ చైతన్య సీబీఎస్‌ఈ క్యాంపస్ ప్రిన్సిపాల్ శైలేష్ కుమార్ పేర్కొన్నారు. కావలి శాంతినగర్‌లోని ఆ పాఠశాలలో గురువారం సరస్వతి పూజ నిర్వహించారు. 1,3వ బ్రాంచ్‌లకు చెందిన విద్యార్థులకు హాల్‌టికెట్లతో పాటు ప్యాడ్‌లు, పెన్నులు, ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో 1వ బ్రాంచ్ ప్రిన్సిపాల్ పీ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అల్లూరు : విద్యార్థులు మనోధైర్యంతో పరీక్షలకు హాజరు కావాలని ఎంఈవో రవీంద్రనాథ్ అన్నారు. మండలంలోని నార్తుమోపూరు శ్రీచైతన్య విద్యాసంస్థల్లో గురువారం నిర్వహించిన సరస్వతి పూజలో ఆయన పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ శివకుమార్, డైరెక్టర్ ఖాజారహంతుల్లా, డీఎస్ఆర్ ట్రస్ట్ మేనేజరు అనీల్‌కుమార్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీలత, కొప్పు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

● **పరీక్ష సామగ్రి పంపిణీ**

కలిగిరి : స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో పదో తరగతి పరీక్షలు రాయనున్న విద్యార్థులకు స్థానిక సాయిదత్త ఫర్నీచర్ యజమాని నీలి ఓబయ్య గురువారం పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. ప్రిన్సిపల్ ఏ శ్రీనివాసులు మాట్లాడుతూ దాతలు విద్యార్థులకు సహాయ సహకారాలు అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కొండాపురంలో విద్యాసామగ్రి పంపిణీ చేస్తున్న గంజాం రాఘవేంద్ర

కొండాపురం : మండలంలోని కొమ్మి జడ్పీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు రాగం ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. ఫౌండేషన్ చైర్మన్, టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి గంజాం రాఘవేంద్ర మాట్లాడుతూ పదిలో ఉత్తమ మార్కులు సాధించాలన్నారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పటిష్టంగా ఎన్నికలకు ఏర్పాట్లు : ఆర్వో

కావలి,మార్చి14: సార్వత్రిక ఎన్నికల ఏర్పాట్లను పటిష్టంగా అమలు చేయాలని కావలి ఆర్వో, ఆర్డీవో శీనా నాయక్ తెలిపారు. ఆర్డీవో కార్యాలయ చాంబరులో గురువారం డీఎస్పీ ఎం. వెంకటరమణ, నియోజకవ ర్గంలోని ఏఈఆర్వోలు మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావన్‌కుమార్, కావలి, బోగోలు, అల్లూరు, దగదర్తి మండల తహసీల్దార్‌లతో ఆయన ఎన్నికల ఏర్పాట్లపై సమీక్షించారు. నామినేషన్ల సెంటర్ వద్ద, ఆర్వో ఆఫీస్ వద్ద, ఎన్నికల సామగ్రి పంపిణీ చేసే రిసెప్షన్ సెంటర్ వద్ద, పోస్టల్ బ్యాలెట్ల దగ్గర, స్ట్రాంగ్ రూములు దగ్గర చేపట్టాల్సిన బందోబస్తు గురించి డీఎస్పీతో చర్చించారు. అలాగే సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లు, నామినేషన్ల ప్రక్రియ, పోస్టల్ బ్యాలెట్ల ప్రక్రియపై తీసుకుంటున్న చర్యల గురించి ఏఈఆర్వోలతో చర్చించారు.

సీఏఏను రద్దు చేయాలని నిరసన

కావలి, మార్చి14: పౌరసత్వ సవరణ చట్టాన్ని (సీఏఏను) రద్దు చేయాలని కోరుతూ పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్, వామపక్షాల నేతలు గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజల మధ్య మతం పేరుతో చిచ్చు పెట్టే బీజేపీ విధానాలను వ్యతిరేకించాలన్నారు. దేశ సార్వభౌమత్వానికి ప్రమాదకరంగా ఉన్న పౌరసత్వ సవరణ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఇన్‌చార్జి చింతాల వెంకట్రావు, సీపీఐ నాయకులు బలిజేపల్లి వెంకటేశ్వర్లు, నాగరాజు, సీపీఎం నా యకులు పీ. పెంచలయ్య, న్యూడెమోక్రసీ నాయకులు కరువది భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు తలనీలాల వేలం పాట

వలేటివారిపాలెం, మార్చి 14: మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయం ప్రాంగణంలోని కల్యాణ మండపంలో శుక్రవారం ఉదయం 10.30 గంటలకు తలనీలాలు బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు ఆలయ ఏసీ కే.బీ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. తలనీలాలు వేలం పాట ఇప్పటికే మూడుసార్లు వాయిదా వేశారు. నాల్గోసారి శుక్రవారం జరిగే వేలంలో పాట పాడతారా లేక మరోసారి వాయిదా పడేనా ? అనే అనుమానం అధికారుల్లో ఉంది.

28న ఆర్‌ఎస్‌ఆర్‌లో టెక్నోఫెస్ట్ 2కే24

బిట్రగుంట : బోగోలు మండలం కడనూతల ఆర్‌ఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 28న టెక్నోఫెస్ట్ 2కే24 పేరుతో టెక్నికల్ ప్రోగ్రామ్ నిర్వహిం చనున్నట్లు ప్రిన్సిపాల్ పీవీఎస్‌రెడ్డి తెలిపారు. గురువారం కళాశాలలో గోడపత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత, చురుకుతనం, విశ్లేషణ వంటి గుణాలను వెలికి తీసేందుకు ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఆర్వీ రమణారెడ్డి, కన్వీనర్ డాక్టర్ ఎస్ కృష్ణచైతన్య, ఆర్గనైజింగ్ కమిటీ మెంబర్లు పీ.సునీల్ రెడ్డి, పీవీ రామ్‌కుమార్, ప్రసాద్‌రెడ్డి, కే.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబును గెలిపించుకుందాం..



బిట్రగుంట : రాష్ట్రంలో రాక్షస పాలనను అంతమొందించి, చంద్రబాబును గెలిపించుకుందామని మండల టీడీపీ ఎన్నికల ఇన్‌చార్జి దగ్గుమాటి వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. బోగోలు మండలం విశ్వనాథరావుపేటలో గురువారం సాయంత్రం టీడీపీ, బీజేపీ, జనసేన కార్యకర్తలతో మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరరావు సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు ఎల్ సుధీర్‌బాబు, ఎంప రవికుమార్, అహ్మద్‌బాషా, జానకిరామయ్య, హరిబాబు, బీజేపీ నాయకులు ఎన్ శ్రీనివాసులు యాదవ్, జీ.వెంకటేశ్వర్లు, వీ జయప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతో ఆత్మీయ సమావేశం

కావలి,మార్చి14: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడటంతో టీడీపీ అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి గురువారం కావలి నమస్కార్ కాన్ఫరెన్స్ హాల్‌లో బీజేపీ నేతలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరం కలిసికట్టుగా పనిచేద్దామని చర్చించుకున్నారు. అనంతరం బీజేపీ నేతలు కావ్య క్రిష్ణారెడ్డిని సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నేతలతోపాటు బీజేపీ నాయకులు కే బ్రహ్మానందం, సీవీసీ సత్యం, కమల, కంచర్ల మురళి, మందా కిరణ్, వింతా రంగారెడ్డి, పరుసు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న క్రిష్ణారెడ్డి

● **న్యాయవాదుల మద్దతు**

కావలి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పలువురు న్యాయవాదులు కావ్య క్రిష్ణారెడ్డి మద్దతు తెలిపారు. అనంతరం పలు సమస్యలను న్యాయవాదులు ఆయనకు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ లీగల్‌సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోట్లూరు శ్రీనివాసులు, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఐవీ రామిరెడ్డి, కార్యదర్శి ప్రకాష్ పాల్గొన్నారు.

● **టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటుకు కృషి**

కావలిలో టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటుకు కృషిచేస్తానని, వస్త్రవ్యాపార కేంద్రంగా కావలిని అభివృద్ధి చేస్తానని టీడీపీ ఉమ్మడి అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి తెలిపారు. గురువారం ఆయన పట్టణంలోని అరుణోదయ, నవోదయ, శుభోదయ వస్త్రమార్కెట్ల సముదాయాల్లో ఎన్నికల ప్రచారం చేశారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నేతలు పాల్గొన్నారు.

కాపు రిజర్వేషన్ కోసం పోరాడిన యోధుడు రమేష్‌బాబు

బిట్రగుంట, మార్చి 14: కాపుల రిజర్వేషన్ కోసం అలుపెరుగని పోరాటం చేసిన యోధుడు మెతుకు రమేష్‌బాబు అని కాపు సంఘం రాష్ట్ర నాయకులు శ్రీహరినాయుడు అన్నారు. బోగోలులో గురువారం జరిగిన రమేష్‌బాబు ఉత్తరక్రియల్లో రాష్ట్ర కాపు జేఏసీ అధ్యక్షుడు చందు జనార్దన్, జేఏసీ నాయకులు రాఘవయ్య, కొక్కిరాల సంజీవ్, మార్కండేయులు, విజయకుమార్, వేర్పూరి శ్రీనివాసరావులు తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు. అలగే మండల బీజేపీ అధ్యక్షుడు నూకసాని శ్రీనివాసులు యాదవ్, వైసీపీ నాయకులు పోలిశెట్టి శ్రీనివాసులు, బీ.నరేంద్రరెడ్డి, స్వచ్ఛంద సంస్థల నాయకులు రామిశెట్టి వెంకటసుబ్బారావు, బోగిరి ప్రభాకర్ తదితరులు రమేష్‌బాబు చిత్రపటానికి పూలమాలు వేసి నివాళర్పించారు. కాపు నాయకురాలు మెతుకు రాజేశ్వరికి ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.



రమేష్‌బాబు చిత్రపటానికి కాపు నాయకుల నివాళి

కోరం లేక గంట ఆలస్యంగా వీవీపాలెం మండల మీట్

● అరగంటలోనే ముగింపు

వలేటివారిపాలెం మార్చి 14 : మూడు నెలలకోసారి జరిగే మండల సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా సాగింది. సమావేశంలో గ్రామాల్లోని సమస్యలపై సభ్యులెవరూ కూడా అ‌ధికారులను ప్రశ్నించలేదు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ పొనుగోటి మౌనిక అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశానికి 21 మంది సర్పంచులు రావాల్సి ఉండగా నలుగురు మాత్రమే హాజరయ్యారు. 10 మంది ఎంపీటీసీలకుగానూ నలుగురే హాజరయ్యారు. కోరంలేక గంట ఆలస్యంగా సమావేశాన్ని ప్రారంభించారు. పలు శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. రెవెన్యూ, ఇరిగేషన్, అటవీశాఖ, వైద్య ఆరోగ్యశాఖ, పంచాయతీరాజ్, రోడ్ల భవనాల శాఖాధికారులు సమావేశానికి హాజరుకాలేదు. ప్రారంభమైన అరగంటలోపే ముగించి అధికారులు చేతులు దులుపేసుకున్నారు. ఈ సమావేశంలో ఎంపీపీ పీ మౌనిక, జడ్పీటీసీ ఇంటూరి భారతి, ఎంపీడీవో రఫీక్‌అహ్మద్, ఎంపీటీసీలు స్వర్ణ నరసింహం,సీహెచ్ యానాది, సీహెచ్ రవీంద్ర, సర్పంచులు ఇరపని సతీష్, అనుమోల అమరేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

జనసేన ఆవిర్భావ దినోత్సవం

కావలిటౌన్, మార్చి14: పట్టణ జనసేన కార్యాలయంలో ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి అ ళహరి సుధాకర్ ఆధ్వర్యంలో గురువారం ఆ పార్టీ 11వ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా సుధాకర్ పార్టీ జెండా ఆవిష్కరించి, అనంతరం కేక్ కట్ చేసి పార్టీ నేతలకు, కార్యకర్తలకు తినిపించారు. ఈ సందర్భంగా ఇల్లు కాలి ఇబ్బంది పడుతున్న జనసేన వీర మహిళకు రూ. 20,000 ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నేతలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



జెండా ఆవిష్కరణలో పాల్గొన్న సుధాకర్, తదితరులు

అద్దెభవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు

అరకొర వసతులతో చిన్నారుల అవస్థలు

కొడవలూరు మార్చి 14: మండలంలో అంగన్‌వాడీ కేంద్రాలను అద్దెభవనాల్లో నిర్వహిస్తుండడంతో అరకొర వసతులతో చిన్నారులు అవస్థలు పడుతున్నారు. మండలంలో 81 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వాటిలో బస వాయపాలెం, గుండాలమ్మపాళెం, కొడవ లూరు -2, నీలగిరి సంఘం, గండవరం, గువ్వగుంట, నాయుడుపాళెం, పెయ్యలపాలెం, టపాతోపు, రాజుపాలెం 1, 2, రైటర్‌తోపు, రెడ్డిగుంట, రమణారెడ్డి గుంట, వడ్డిపాలెం, యల్లయపాళెం, మూలగట్ల సంఘం, తలారిపాలెం అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవానాల్లో నడుస్తున్నాయి. ఇరుకు గదులు, రేకులు షెడ్లుల్లో ఉక్కపోతతో చిన్నారులు అల్లాడుతున్నారు. ఇరుకు గదుల్లో వారికి చదువు చెప్పాలన్నా, ఆడించాలన్నా ఇబ్బందిగా మారింది. మూలగట్ల సంఘం, రమణారెడ్డి గుంట, వడ్డిపాలెం, యల్లయపాలెం అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్లు కూడా లేక చిన్నారులు అవస్థలు పడుతున్నారని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అంగన్‌వాడీ కేంద్రాల్లో వసతులు కల్పించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.



మూలగట్ల సంఘంలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రం

జనసేన బలోపేతానికి కృషి



జెండా ఆవిష్కరిస్తున్న బొబ్బేపల్లి సురేష్ నాయుడు

వెంకటాచలం, మార్చి 14: సర్వేపల్లి నియోజక వర్గంలో జనసేన పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నామని నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొబ్బేపల్లి సురేష్ నాయుడు అన్నారు. సర్వేపల్లిలోని పార్టీ కార్యాలయంలో గురువారం పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా జెండా ఆవిష్కరణ చేసిన అనంతరం మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి సర్వేపల్లి నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి గెలుపునకు లేకుండా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో గుమ్మినేని వాణిభవాని, పినిశెట్టి మల్లికార్జున్, శ్రీహరి, దయాకర్, షేక్ రహీమ్, అక్బర్, అశోక్, మురళీ, సుధాకర్, మస్తాన్, కల్లిరెడ్డి శ్రీనివాసులు తదితరులున్నారు.

వైసీపీని ఓడించడమే లక్ష్యం

మనుబోలు: స్థానిక వైఎస్‌ఆర్ కూడలి వద్ద గురువారం జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. జెండా ఆవిష్కరించి కేక్ కట్ చేసి పంచిపెట్టారు. పార్టీ మండలాధ్యక్షుడు ప్రసాద్ మాట్లాడుతూ వైసీపీని ఓడించడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలన్నారు. కార్యక్రమంలో పవన్, సురేష్, ఖాదరవల్లి, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సరస్వతి పూజ



పొదలకూరు: పూజలో పాల్గొన్న ఉపాధ్యాయులు

పొదలకూరు, మార్చి 14 : పట్టణంలోని డీఎస్‌ఆర్ జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం సరస్వతీ దేవి పూజా కార్యక్రమాన్ని విద్యార్థులు, ఉపాధ్యాయినులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీ కళ్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రధాన అర్చకులు వాకాణి శ్రీనివాసాచార్యులు పూజలు చేశారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు జ్యోతి, విద్యా కమిటీ చైర్మన్ సురేఖ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది, పాల్గొన్నారు.

నిడిగుంటపాళెం హైస్కూల్‌లో

వెంకటాచలం: మండలంలోని నిడిగుంటపాళెం జడ్పీ హైస్కూల్ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా సరస్వతీ పూజ చేశారు. అనంతరం పదవ తరగతి పరీక్షల్లో టాపర్స్‌గా నిలిచిన విద్యార్థులకు డాక్టర్ ప్రేమ్‌సాగర్‌రెడ్డి ఫౌండేషన్ ద్వారా బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం చలపతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎరువుల పరిశీలన



ఎరువులను పరిశీలిస్తున్న అధికారులు

సైదాపురం, మార్చి 14: మండలంలోని రైతు భరోసా కేంద్రాల్లోని ఎరువులను జిల్లా మార్కెఫెడ్ డీఎం పవన్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన ఎరువులు అందుబాటులో ఉంచి రైతులకు అందిస్తామన్నారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సలహాలు సూచనలు చేశారు. వీరి వెంట ఏవో హైమావతి, సిబ్బంది పాల్గొన్నారు.

వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి గెలుపు ఖాయం : చేజర్ల

కోవూరు, మార్చి 14: కోవూరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా పోటీచేయనున్న వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి గెలుపు ఖాయమని ఆ పార్టీ పార్లమెంటు కమిటీ ప్రధాన కార్యదర్శి చేజర్ల వేంకటేశ్వర్లురెడ్డి అన్నారు. టీడీపీ కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రశాంతిరెడ్డి అభ్యర్థిత్వాన్ని ప్రకటించిన పార్టీ అధినేత చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు పంతంగి రామారావు, జొన్నాదుల రవికుమార్, కలికి సత్యనారాయణరెడ్డి, ఇంటూరు విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతిరెడ్డికి టికెట్ కేటాయింపుపై సంబరాలు

విడవలూరు: కోవూరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సతీమణి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి టికెట్టు కేటాయించడం పట్ల మండలంలో గురువారం పార్టీ నాయకులు, అభిమానులు సంబరాలు చేసుకున్నారు. పార్లపల్లి, ముదివర్తి, ఊటుకూరు, వీరారెడ్డిపాలెం గ్రామాల్లో టపా సులు కాల్చి కేక్‌లు కట్ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సత్యవోలు సత్యంరెడ్డి, వేగూరు చంద్రారెడ్డి, ఉచ్చూరు సుదీప్‌రెడ్డి, ఎస్‌కె రఫీ, పూండ్ల యోసేబు, తుళ్లూరు మాధవ్, తిమ్మరాజు తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



పార్లపల్లిలో టీడీపీ నేతల సంబరాలు

రేబాల నుంచి నెల్లూరుకు భారీ బైక్ ర్యాలీ

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని రేబాల గ్రామం నుంచి ఎర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో 150కి పైగా బైక్‌లతో ర్యాలీగా నెల్లూరులోని వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని కలిసేందుకు 200మందికి పైగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు గురువారం సాయంత్రం తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎంపీపీ శ్రీనివాసులు, పుట్టా సుబ్రమణ్యంనాయుడు, పెనాక అమరనాథరెడ్డి, చోళం వెంకయ్య, టీవీఆర్ పాల్గొన్నారు.

రాపూరులో టీడీపీ నేతల సంబరాలు

రాపూరు(డక్కిలి), మార్చి 14 : వెంకటగిరి అసెంబ్లీ నియోకవర్గ టీడీపీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ కుమార్తె లక్ష్మీ సాయిప్రియ పేరు ప్రకటించడంతో టీడీపీ అభిమానులు, నాయకులు, కార్యకర్తలు గురువారం రాత్రి రాపూరులో బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. లక్ష్మీ సాయిప్రియను గెలిపించుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. కురుగొండ్ల నివాసానికి వెళ్లి ఆమెను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎదోటి కోటేశ్వరనాయుడు, కె రాఘవరెడ్డి, పచ్చిగళ్ల రత్నయ్య, రమణమ్మ ఉన్నారు.



రాపూరులో బాణసంచా కాల్చుతున్న కురుగొండ్ల అభిమానులు

వైసీపీ పాలనకు చరమగీతం పాడండి : సోమిరెడ్డి

మనుబోలు, మార్చి 14: రాష్ట్రంలో దుర్మార్గ వైసీపీ పాలనకు చరమగీతం పాడాలని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని చెరుకుమూడి గ్రామంలో గురువారం సాయంత్రం బాబు షూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొని ఇంటింటికీ తిరిగి కరపత్రాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో టీడీపీకి ఆదరణ పెరిగిందని, టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి కూటమే అధికారంలోకి వస్తుందని, చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో పొన్నూరు రామకృష్ణయ్య, మస్తాన్‌నాయుడు, దొడ్డపనేని రాజానాయుడు, రామానాయుడు, మేడి కొండ శ్రీహరి, మేడికొండ రామానాయుడు, దండు చంద్రశేఖర్‌రెడ్డి, సురేంద్ర, బొడ్డు మస్తానయ్య, కూరపాటి రమేష్, మస్తానయ్య, రామయ్య, జనసేన నాయకుడు బొబ్బేపల్లి సురేష్‌నాయుడు తదితరులున్నారు.



మహిళలతో మాట్లాడుతున్న సోమిరెడ్డి

పౌష్టికాహారంపై అవగాహన

ఇందుకూరుపేట, మార్చి 14: జగదేవిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని జగదేవిపేట సెక్టార్ మెయిన్ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పౌష్టికాహార పక్షోత్సవ కార్యక్రమంలో భాగంగా స్టాల్స్ ఏర్పాటుచేసి పౌష్టికాహారంపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ సీహెచ్ సుధాకర్‌రావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆర్ సుబ్బరత్నమ్మ, హెచ్‌ఈవో శ్రీనివాసరావు, హెల్త్ అసిస్టెంట్ మాధవ, ఎంపీపీ స్కూల్ ఉపాధ్యాయులు ఖాజావలి పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్, సీసీరోడ్ల ప్రారంభం

బుచ్చిరెడ్డిపాళెం, మార్చి14: మండలంలోని కట్టుబడిపాళెంలో ఆర్‌ఓ ప్లాంటును, మునులపూడిలో సీసీరోడ్లను కోవూరు ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి గురువారం సాయంత్రం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, టంగుటూరు మల్లికార్జునరెడ్డి, సర్పంచు రమణారెడ్డి, ఆమారి మంజు భార్గవి, శ్రీనివాసులు, యామాల మోహన్, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

రోగులకు సకాలంలో మందులు అందించాలి

మనుబోలు, మార్చి 14: క్షయ, లెప్రసీ, ఎయిడ్స్ వంటి వ్యాధులను నివారించాలని అడిషనల్ డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ ఎస్‌కే ఖాదర్‌వలి అన్నారు. మనుబోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, ఎఫ్‌పీసీ కేంద్రాన్ని, ఇంటర్మీడియట్ జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన మెడికల్ క్యాంపులను గురువారం తనిఖీ చేశారు. క్షయ, లెప్రసీ, ఎయిడ్స్ రోగులకు అందుతున్న సేవల గురించి విచారించారు. అంతేకాకుండా అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్‌పై పలు సూచనలు, సలహాలిచ్చారు. కార్యక్రమంలో వైద్యాధికారిని డాక్టర్ మోహసిన్ సుల్తానా, సీహెచ్‌వో రాజయ్య, హెల్త్ సూపర్‌వైజర్ వెంకటరమణయ్య పాల్గొన్నారు.

కసుమూరు పీహెచ్‌సీ తనిఖీ

వెంకటాచలం : మండలంలోని కసుమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (పీహెచ్‌సీ) గురువారం జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వలి తనిఖీ చేశారు. ఈసందర్భంగా పీహెచ్‌సీలోని రికార్డులు, డెలివరి గది తదితర వాటిని పరిశీలించి తగు సూచనలు చేశారు. వాక్సినేషన్ శాతం పెంచాలన్నారు. క్షయ, లెప్రసీ వంటి రోగులను గుర్తించి వారికి సకాలంలో మందులు అందించి వ్యాధి నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో కసుమూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ అర్షియ, సీహెచ్‌వో రామసుబ్బారెడ్డి, టీబీ జిల్లా కోఆర్డినేటర్ విజయ్, పీహెచ్‌సీ సూపర్‌వైజర్ వెంకటేశ్వర్లు, సిబ్బంది జావెద్, శివాజి తదితరులున్నారు.

ఎస్ఈఐఎల్ ఉద్యోగులకు అవార్డులు

తోటపల్లిగూడూరు, మార్చి 14 : జాతీయ భద్రతా వారోత్సవాల ముగింపు వేడుకలు గురువారం ఎస్ఈఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ కంపెనీలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏపీ జెన్‌కో (ఎస్‌డీఎస్‌టీపీఎస్) చీఫ్ ఇంజనీర్ (ఓఅండ్‌ఎం) కె సుధీర్ బాబు పాల్గొని మాట్లాడుతూ ప్రపంచస్థాయి భద్రతా ప్రమాణాలు పాటిస్తూ ఎస్ఈఐఎల్ ఎనర్జీ రోల్‌మోడల్‌గా నిలిచిందన్నారు. ఈ సందర్భంగా భద్రతా ప్రమాణాలను పాటించడంలో నిబద్ధతను ప్రదర్శించిన ఉద్యోగులకు సర్టిఫికెట్లు, అవార్డులు అందచేశారు. ఈ కార్యక్రమంలో కంపెనీ సీఈవో శ్రీరాఘవ్ త్రివేది, ఓఅండ్‌ఎం హెడ్ సునీల్‌కుమార్‌గుప్తా, విభాగాధిపతులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



అవార్డులు అందచేస్తున్న యాజమాన్యం

గ్రామాల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలి

మనుబోలు, మార్చి 14: గ్రామీణ ప్రాంతాల్లో వైద్యసేవలు సక్రమంగా అందించాలని ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ దయాకర్ సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆరోగ్యకేంద్రాన్ని గురువారం ఆయన తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. సమయపాలన పాటించి విధులకు హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి పూజిత, సీహెచ్‌వో రాజయ్య తదితరులున్నారు.

అందరం కలిసి పని చేద్దాం!

• కూటమి గెలుపే లక్ష్యం • మాజీ మంత్రి పొంగూరు నారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న నారాయణ

నెల్లూరు (వైద్యం), మార్చి 14 : వచ్చే ఎన్నికలలో అందరం కలిసి పనిచేద్దామని మాజీ మంత్రి, టీడీపీ నేత పొంగూరు నారాయణ పిలుపునిచ్చారు. గురువారం నగరంలోని గోమతి నగర్ క్యాంపు కార్యాలయంలో జనసేన జాతీయ అధికార ప్రతినిధి వేములపాటి అజయ్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. నారాయణ మాట్లాడుతూ జిల్లాలో టీడీపీ అభ్యర్థుల గెలుపు నకు అందరూ ఐక్యంగా కృషి చేయాలన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి రాష్ట్రంలో అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. నెల్లూరులో ఉమ్మడి అభ్యర్థుల గెలుపే ధ్యేయంగా జన సైనికులు పనిచేస్తారని నారాయ ణకు నేతలు హామీ ఇచ్చారు. ఈ కార్యక్ర మంలో టీడీపీ రాష్ట్ర ప్రధా న కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి ఆనం వెంకట రమణారెడ్డి, రాష్ట్ర ఉపాధ్య క్షుడు ధర్మవరం సుబ్బారావు, నగర అధ్యక్షుడు మామిడాల మధు, తాళ్లపాక అనూరాధ, జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిశోర్, జిల్లా అధికార ప్రతినిధి కారంపూడి రామకృష్ణ, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సుందరరామిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో యువత చేరిక : ఆహ్వానించిన నారాయణ

నెల్లూరు (వైద్యం), మార్చి 14 : నారాయణ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం యువకులు టీడీపీలో చేరారు. మాజీమంత్రి, టీడీపీ నేత పొంగూరు నారాయణ వారికి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. గోమతి నగర్‌లోని నారాయణ క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో నారాయణ మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ప్రజాసంక్షేమాన్ని గాలికొదిలేసిందని మండి పడ్డారు. టీడీపీ శ్రేణులకు వెన్నంటే ఉంటామని వెల్లడించారు. కాగా, రాబోవు ఎన్నికలలో నారాయణను గెలిపిస్తే నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీని పూర్తి చేస్తారని నారాయణ సతీమణి రమాదేవి వెల్లడించారు. నగరంలోని 16, 39 డివిజన్లలో బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ఆమె పాల్గొని ఇంటింటికి తిరిగి టీడీపీని గెలిపించాలని కోరారు.



సర్వోదయ కళాశాల ఖాళీ స్థలం లీజుకు వేలం పాటలు

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 14 : నగర నడిబొడ్డున ఉన్న సర్వోదయ కళాశాలకు చెందిన ఖాళీ స్థలం నెల బాడుగకు ఇచ్చేందుకు గురువారం బహిరంగ వేలంపాటలు జరిగాయి. కళాశాల గేటుకు దక్షిణం వైపు నుంచి ఆంధ్రా బ్యాంకు వరకు గల స్థలాన్ని 13 దుకాణాల ఏర్పాటుకు పాటదారులు పాడుకున్నారు. ఆయా దుకాణాల నెలబాడుగను కళాశాలకు చెల్లించాలి. కళాశాల కరస్పాండెంట్ హేమచంద్రరావు ఆధ్వర్యంలో వేలంపాటలు జరిగాయి. తొలుత వేలం కొంత మంది పాటదారులు సిండికేట్ కావాలన్న పథకాన్ని కరస్పాండెంట్‌పై ఒత్తిడి చేసేందుకు పైరవీలు చేశారు. కానీ పాటదారులు ఎక్కువ మంది పాల్గొనడంతో పాటలు పోటీగా జరిగాయి. ఈ పాటల ద్వారా సర్వోదయ కళాశాలకు ప్రతి నెల రూ.6.38 లక్షలకు ఆదాయం లభిస్తుంది.

ఎలాంటి కష్టమొచ్చినా అండగా ఉంటా!

● టీడీపీ, జనసేన ఆత్మీయ సమావేశంలో వేమిరెడ్డి



మాట్లాడుతున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు(హరనాథపురం), మార్చి 14 : మీ అందరికి ఎటువంటి కష్టమొచ్చినా కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఎలా అండగా ఉంటాడో అలాగే తాను కూడా అండగా ఉంటానని టీడీపీ ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. నగరంలోని పిచ్చిరెడ్డి కల్యాణ మండపంలో గురువారం టీడీపీ, జనసేన పార్టీల ఆత్మీయ సమావేశం జరిగింది. వేమిరెడ్డి మాట్లాడుతూ ఆత్మ విశ్వాసంతో ఎన్నికలకు వెళ్దామన్నారు. ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశం, బీజేపీ, జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థిగా నెల్లూరు రూరల్ నుంచి పోటీచేస్తున్న తన కోసం మరో నెలరోజులు కష్టపడండని నాయకులు, కార్యకర్తలను కోరారు. పోలింగ్ దాకా నేను చెప్పేది మీరు వినండి, పోలింగ్ తరువాత మీరు చెబితే చేసే దానికి నేను సిద్ధంగా ఉన్నానని చెప్పారు.

ప్రశాంతిరెడ్డికి అభినందనల వెల్లువ

టీడీపీ కోవూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని ప్రకటించడంతో గురువారం ఆమెకు అభినందనలు వెల్లువెత్తాయి. అభిమానులతో ఆమె నివాసం కిటకిటలాడింది.

రూ.6 కోట్ల భూమిని స్వాధీనం చేసుకోండి : టీడీపీ

నెల్లూరు రూరల్, మార్చి 14 : నెల్లూరు రూరల్ నియోజకవర్గం లోని అంబాపురంలో రూ. 6 కోట్ల విలువ చేసే మూడెక రాల ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందని, దీనిని అధికా రులు స్వాధీనం చేసుకుని అందులో పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జెన్ని రమణయ్య డిమాండ్ చేశారు. గురువారం వివాదస్పద భూమిని కార్పొరేటర్ బద్దేపూడి నరసింహగిరి, టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పరిశీలించారు. అనంతరం మా ట్లాడుతూ అంబాపురం వద్ద 26 ఎకరాల్లో అధికార పార్టీకి చెందిన ఓ నేత రియల్ వెంచరు నిర్మి స్తున్నాడని, అందులో దిబ్బ, గయ్యాళ్లు పోరంబోకుకు చెందిన మూడెకరాల ప్రభుత్వ భూమి ఉం దన్నారు. రూ. ఆరు కోట్ల విలువ చేసే ఆ భూమిని వైసీపీ నాయకులు కబ్జా చేశారని ఆరోపిం చారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకోవాలని, లేకపోతే పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకట రమణ, పిగిలం నరేష్, మహేశ్వరన్, శేషు పాల్గొన్నారు.

ఘనంగా జనసేన ఆవిర్భావ దినోత్సవం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), మార్చి 14: జనసేన పార్టీ 11వ ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించారు. నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో నగర అధ్యక్షుడు సుజయ్‌బాబు ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. సుజయ్ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో జనసేన, టీడీపీ, బీజేపీ ఉమ్మడి ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి రావడం తథ్యమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులురెడ్డి, షేక్ ఆలియా, జోనుబోయిన ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు. కాగా, సుబేదార్‌పేటలోని జనసేన పార్టీ కార్యాలయంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ ఆధ్వర్యంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. రేపటి తరానికి భరోసా జనసేన పార్టీ జెండా అని ఆయన పేర్కొన్నారు.

వాకర్స్‌కు కంటి వైద్య పరీక్షలు

నెల్లూరు (విద్య), మార్చి 14 : నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాం ప్లెక్స్‌లో గురువారం వాకర్స్ కు కంటివైద్య పరీక్షలు నిర్వ హించారు. ప్రపంచ గ్లకోమా వీక్ సందర్భంగా వివేకా నంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మోడ్రన్ ఐ, రీసెర్చ్ సెంటర్ సహకారంతో ఈ కార్యక్రమా న్ని ఏర్పాటు చేశారు. కంటివైద్య నిపుణులు చిన్మయి, వినీల మాట్లాడుతూ కళ్లకు సంబంధించి ఏ చిన్న సమస్య వచ్చినా వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. మానవ శరీరంలో కీలకమైన నేత్రాలను జాగ్రత్తగా కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. నేత్ర సంరక్షణ, వ్యాధులపై అవగాహన కల్పించారు. కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు డీవీ సుబ్బరాజు, కార్యదర్శి స్వర్ణ రమేష్‌బాబు, వ్యవస్థాపకుడు మేకల నరేంద్రరెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

సంతపేట స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా సుబ్బరాజు

నెల్లూరు(క్రైం), మార్చి 13: సంతపేట పోలీసుస్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా ఏ సుబ్బరాజు గురువారం బాధ్యతలు స్వీకరించారు. సీఐల బదిలీల్లో సంతపేట ఇన్‌స్పెక్టర్ పనిచేస్తున్న బీ కల్యాణ్‌రాజు స్థానంలో సుబ్బరాజు నియమితులయ్యారు. ఆయన 2009లో పోలీసుశాఖలో ఎస్‌ఐగా విధుల్లో చేరారు. ప్రకాశం జిల్లాలోని వివిధ పోలీసుస్టేషన్లలో విధులు నిర్వహించారు. ఈ ఏడాది జనవరిలో సీఐగా పదోన్నతి పొందారు. ఉన్నతాధికారుల సూచనలు, సలహాలు పాటిస్తూ శాంతిభద్రతలను పర్యవేక్షిస్తానన్నారు. అనంతరం ఉన్నతాధికారులను మర్యాద పూర్వకంగా కలిశారు.

'నారాయణ'లో కిడ్నీ వ్యాధులకు ప్రత్యేక పరీక్షలు

● సూపరింటెండెంట్ డాక్టర్ హరిప్రసాద్‌రెడ్డి, డాక్టర్ ప్రవీణ్

నెల్లూరు (వైద్యం), మార్చి 14 : నారాయణ సూపర్‌స్పెషాలిటీ ఆసు పత్రిలో కిడ్నీ వ్యాధులకు ప్రత్యేక పరీక్షలు నిర్వహిస్తు న్నట్లు ఆసుపత్రి సూపరిం టెండెంట్ డాక్టర్ హరిప్రసాద్ రెడ్డి వెల్లడించారు. గురువారం ప్రారంభమైన ఈ కార్యక్రమం ఏప్రియల్ 13వ తేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు. గురువారం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచ కిడ్నీ వ్యాధుల నివారణ దినోత్సవంలో భాగంగా ప్రత్యేక ప్యాకేజీని ప్రవేశపెట్టామన్నారు. రూ.2500 చేసే కిడ్నీ పరీక్షలు రూ.999కే నిర్వహిస్తున్నామని చెప్పారు. నెఫ్రాలజిస్ట్ డాక్టర్ కొల్లా ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ శరీరానికి అవసరమైన డీ విటమిన్ కిడ్నీలో తయారవుతుందన్నారు. నీరు, లవణాలను సమతుల్యంగా ఉంచుతూ శరీరాన్ని కిడ్నీలు కాపాడుతుంటాయని తెలిపారు. అలాంటి కిడ్నీల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సాదినేని రాఘవేంద్ర, ఏజీఎం శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నారాయణ వైద్య కళాశాలకు పార్థివదేహం సమర్పణ

నెల్లూరు (వైద్యం), మార్చి 14 : నగరంలోని ఎన్టీఆర్ నగర్‌కు చెందిన సోమిశెట్టి మోహన్‌రావు మృతి చెందడంతో ఆయన పార్థివ దేహాన్ని కుటుంబ సభ్యులు నారాయణ వైద్య కళాశాలకు గురువారం అందించారు. పినాకిని దేహసమర్పకుల సంస్థ సహకారంతో మోహన్ రావు మృతదేహాన్ని కుమార్తె మోహిత అందచేశారు. నారాయణ వైద్య కళాశాల పరిపాలన అధికారి డాక్టర్ సందేశ్ రాయకర్, డాక్టర్ అలగల వెంకట రమణయ్య, వంశీకృష్ణ, ఆశాలత, మోహన్‌రావు అల్లుడు సాజిత్ రాజన్, కుమార్తె హిమసాగరిక, జనవిజ్ఞాన వేదిక నేత విజయమ్మ, సుబ్బారావు పాల్గొన్నారు.



మోహన్‌రావు (ఫైల్)

భక్తిశ్రద్ధలతో కృతిక ప్రదోషకాల పూజ

నెల్లూరు (సాంస్కృతికం) మార్చి 14 : నగరంలోని కనుపర్తిపాడులో గల వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో గురువారం సాయంత్రం కృతిక ప్రదోషకాల పూజలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఈ సందర్భంగా అభిషేకాలు, పంచామృతాభిషేకాలు, వివిధ సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు జరిగాయి. అనంతరం ప్రత్యేక అలంకారం, పూజలు జరిగాయి. వచ్చారు.

'నారాయణ'లో ఐటీ సదస్సు

నెల్లూరు (విద్య), మార్చి 14 : నగరంలోని నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం సీఎస్‌ఈ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఐటీ సదస్సు నిర్వహించారు. సింగపూర్ ఇండస్ట్రీ ఇనిస్టిట్యూట్ ఇంటర్నేషనల్ సెల్‌కు చెందిన సీనియర్ ప్రాజెక్ట్ మేనేజర్ కాలేషా షేక్ మాట్లాడుతూ ప్రస్తుత ఐటీ పరిస్థితులపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలన్నారు. ఐటీ రంగంలో ఎన్నో ఉన్నత అవకాశాలు అందుబాటులో ఉన్నాయని, వాటిని అందిపుచ్చుకునేందుకు అత్యాధునికమైన పద్ధతుల గురించి తెలుసుకోవాల న్నారు. ఆ తర్వాత ఐటీ రంగంలోని నూతన పద్ధతులను వివరించి విద్యార్థుల సందేహాలను ఆయన నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులురెడ్డి, రాజేంద్ర పాల్గొన్నారు.

దొంతాలిలో అభివృద్ధి కార్యక్రమాలు

నెల్లూరు రూరల్, మార్చి 14 : దొంతాలిలో నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి గురువారం పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం ఇంటిం టా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, ఎంపీపీ విజయకుమార్ పాల్గొన్నారు.

కంప్యూటర్, కర్టెన్ల వితరణ

నెల్లూరు (సాంస్కృతికం) : పెద్దబజారులో ఉన్న జర్నలిస్టు భవన్‌కు కర్టెన్లు, కంప్యూటర్‌ను వితరణ చేస్తానని సరయు షోరూం అధినేత రాజకుమార్ హామీ ఇచ్చారు. గురువారం ఆయన జర్నలిస్టులతో పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఏప్రిల్‌నెలలో తాను జర్నలిస్టు భవన్‌కు సౌకర్యాలు కల్పిస్తానని తెలిపారు.

విశిష్ట హాస్టల్ మూత : ఎంహెచ్‌వో


నెల్లూరు(సిటీ), మార్చి 14 : ప్రజా రోగ్య శాఖ నిబంధన లకు విరుద్ధంగా నడు స్తున్న విశిష్ట బాలుర ప్రైవేట్ కళాశాల అనుబంధ హాస్టల్‌ను మూసేస్తు న్నట్లు కార్పొరేషన్ ఆరోగ్య అధికారి (ఎంహెచ్‌వో) వెంకట రమణయ్య తెలిపారు. 27వ డివిజన్ రిత్విక్ ఎన్‌క్లేవ్ లో ఉన్న హాస్టల్‌పై తరుచూ ఫిర్యాదులు అందుతుండటంతో గురువారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించామన్నా రు. ఇక్కడ ఆహార వ్యర్థాలను వసతి గృహానికి అతి సమీపంలో ఉంచారని, వంట గదుల్లో ఎలుకలను గుర్తించామని, గదుల్లో పరిమితికి మించి విద్యా ర్థులున్నారని తెలిపారు. హాస్టల్ నిర్వహణ సక్రమంగా లేనందున సీజింగ్ ఆర్డర్ జారీ చేశామన్నారు. నెల్లూరు నగర పాలక సంస్థ నుంచి జారీ చేసిన ఆరోగ్యపరమైన అన్ని అనుమతులను రద్దు చేస్తున్నామని ప్రకటించారు.

17న ఆత్మీయ సేవా ప్రతిభా పురస్కారాలు

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 14 : ఆర్యవైశ్య కుటుంబాలకు ఈ నెల 17న ఆత్మీయ ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్నట్లు ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్, ది నెల్లూరు అర్బన్ ఆర్యవైశ్య సంఘం గౌరవాధ్యక్షుడు పేర్ని సీతారామారావు తెలిపారు. గురువారం ఉదయం నగరంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. ఈ పురస్కారాల కార్యక్రమం నవాబుపేట ఏబీఎస్ కల్యాణ మండపంలో ఉదయం 10 గంటలకు జరుగుతుందని తెలిపారు. పేద ఆర్యవైశ్య మహిళలు వెయ్యి మందికి పసుపు, కుంకుమ చీరలు పంపిణీ చేస్తున్నామన్నారు. అనంతరం ఈ కార్యక్రమ కరపత్రాలు ఆవిష్కరించారు.

ప్రజల చూపు.. టీడీపీ వైపు : కోటంరెడ్డి

నెల్లూరు(వ్యవసాయం), మార్చి 14 : రాష్ట్ర ప్రజలందరూ తెలుగుదేశం పార్టీ వైపు చూస్తున్నారని ఎంతో మంది వైసీపీ నేతలు సైతం టీడీపీలో చేరేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారని టీడీపీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు చెందిన నాయకులు గురువారం ఆయన సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా కోటంరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే ఎంతో అనుభవం ఉన్న చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకుం టున్నారని చెప్పారు. 34, 35 డివిజన్లకు చెందిన నాయకులు పార్టీలో చేరారు. నెల్లూరు రూరల్ మండలం ఆమంచర్ల గ్రామానికి చెందిన బుట్టి రఘురామయ్య, ఇండ్ల శ్రీనివాసులు, పాడేటి రాజా ఆధ్వర్యంలో కొంత మంది పార్టీలో చేరారు. కార్యక్రమంలో నాయ కులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, సాబీర్‌ఖాన్, దేవరకొండ ప్రసా ద్, శ్రీనివాసులురెడ్డి, శంకర్, వాసిరెడ్డి చంద్రగాన్, షంషు ద్దీన్, లక్ష్మీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చంద్రగిరి

పూర్తి పేరు: పులివర్తి వెంకట మణిప్రసాద్ అలియాస్ నాని
పుట్టిన తేది: 21-5-1971
విద్యార్హత: డిగ్రీ
తల్లిదండ్రులు: లక్ష్మీభారతి, నాగరాజ నాయుడు
భార్య: పులివర్తి రాగసుధ
పిల్లలు: కుమారుడు వినీల్
స్వగ్రామం: పులివర్తివారిపల్లి, పాకాల మండలం
గతంలో పదవులు: సర్పంచ్, తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, జిల్లా ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. ప్రస్తుతం చిత్తూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడుగా కొనసాగుతున్నారు.



శ్రీకాళహస్తి

పూర్తి పేరు: బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి
పుట్టిన తేది: 22-5-1979
విద్యార్హత: ఎంబీఏ
తల్లిదండ్రులు: బృందమ్మ, బొజ్జల గోపాలకృష్ణారెడ్డి
భార్య: రిషిత
పిల్లలు: కుమార్తెలు అనిక, సమిక
స్వగ్రామం: ఊరందూరు, శ్రీకాళహస్తి మండలం



చంద్రగిరి అభ్యర్థిగా నానీని ప్రకటించడంపై టీడీపీ శ్రేణుల ఉత్సాహ ర్యాలీ



వెంకటగిరి

పూర్తి పేరు: కురుగొండ్ల లక్ష్మీ సాయిప్రియ
పుట్టిన తేది: 08-02-1994
విద్యార్హత: ఎమ్మెస్సీ
తల్లిదండ్రులు: సింధు, కురుగొండ్ల రామకృష్ణ
భర్త: శ్రీనివాస తేజ
పిల్లలు: కుమార్తె యామి
స్వగ్రామం: కమ్మవారిపల్లి, డక్కిలి మండలం



సత్యవేడు

పూర్తి పేరు: కోనేటి ఆదిమూలం
వయస్సు : 72 సంవత్సరాలు
విద్యార్హత : బీఏ
తల్లిదండ్రులు: కాంతమ్మ, ఏళుమలై
భార్య: గోవిందమ్మ
పిల్లలు : కుమారుడు సుమన్ కుమార్, కుమార్తెలు స్వప్న శోభ, శ్రావణి
స్వగ్రామం : భీముని చెరువు, నారాయణ వనం మండలం
గతంలో పదవులు: భీముని చెరువు సర్పంచ్‌గా మూడు సార్లు, నారాయణవనం వైస్ ఎంపీపీగా, జడ్పీటీసీగా ఒక్కో పర్యాయం పని చేశారు. టీడీపీ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడిగా రెండు సార్లు, డీసీసీ కార్యదర్శిగా రెండు సార్లు పార్టీ పదవులను నిర్వహించారు. 2014లో వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చెందారు. 2019లో వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు.

ఎన్నికల పోరుకు టీడీపీ సిద్ధం

తాజాగా ఏడు స్థానాలకు అభ్యర్థుల ప్రకటన

ఇదివరకే తొమ్మిది సీట్లకు ఖరారు

పార్టీ శ్రేణుల్లో పెరిగిన జోష్

సత్యవేడులో మాత్రం పార్టీ వర్గాల్లో అసంతృప్తి

తిరుపతి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల షెడ్యూలు ప్రకటించక ముందే తెలుగుదేశం పార్టీ ఎన్నికల పోరుకు సిద్ధమైంది. తిరుపతి, ఉమ్మడి చిత్తూరు జిల్లాల పరిధిలో ఇదివరకే తొమ్మిది స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన టీడీపీ గురువారం మిగిలిన ఏడు స్థానాలకు కూడా అభ్యర్థులను వెల్లడించేసింది. మొత్తం 17 స్థానాలకు గానూ జనసేనకు కేటాయించిన తిరుపతి మినహా 16 సీట్లకూ అభ్యర్థులను ఖరారు చేసి ప్రకటించేయడంతో పార్టీ శ్రేణుల్లో ఫుల్ జోష్ నెలకొంది. తొలి జాబితాలో చోటు దక్కని నియోజకవర్గాల్లో మార్పులుంటాయోమోనని అనుమానంతో దిగాలు పడిన కార్యకర్తలకు తాజా ప్రకటనతో సందేహాలన్నీ పటాపంచలయ్యాయి. దీంతో వారు రెట్టించిన ఉత్సాహంతో ప్రచారంలోకి దూకుతున్నారు.

అభ్యర్థులు వీరే!

టీడీపీ అధినేత చంద్రబాబు గురువారం విడుదల చేసిన అభ్యర్థుల జాబితాలో మదనపల్లెకు మాజీ ఎమ్మెల్యే షాజహాన్ బాషా, పుంగనూరుకు చల్లా రామచంద్రారెడ్డి, పూతలపట్టుకు డాక్టర్ మురళీ మోహన్, చంద్రగిరికి పులివర్తి నానీ, సత్యవేడుకు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, శ్రీకాళహస్తికి బొజ్జల సుధీర్‌రెడ్డి, వెంకటగిరికి మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ కుమార్తె లక్ష్మీ సాయి ప్రసన్న అభ్యర్థులుగా వున్నారు. తొలి జాబితాలో కుప్పం నుంచీ అధినేత చంద్రబాబు, తంబళ్లపల్లెకు జయచంద్రారెడ్డి, పలమనేరుకు మాజీ మంత్రి అమరనాథరెడ్డి, చిత్తూరుకు గురజాల జగన్మోహన్, జీడీనెల్లూరుకు డాక్టర్ థామస్, నగరికి గాలి భానుప్రకాష్ పేర్లు వెల్లడైన సంగతి తెలిసిందే. మొత్తానికీ తిరుపతి, ఉమ్మడి చిత్తూరు జిల్లాల పరిధిలో మొత్తం 17 అసెంబ్లీ స్థానాలుండగా జనసేనకు కేటాయించిన తిరుపతిని మినహాయిస్తే మిగిలిన 16 స్థానాలకూ అభ్యర్థులు ఖరారైపోయారు.

ఆరు స్థానాల్లో బలమైన అభ్యర్థులు

టీడీపీ రెండో జాబితాలో ఆరు నియోజకవర్గాలకు బలమైన నేతలను అభ్యర్థులుగా ప్రకటించింది. మదనపల్లెలో షాజహాన్ బాషా 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచీ ఎమ్మెల్యేగా గెలిచారు. 2014లో హేమాహేమీలైన నేతలంతా కాంగ్రెస్‌ను విడిచిపెట్టి వెళ్ళిపోగా ఆయన మాత్రం పార్టీనే అంటిపెట్టుకుని 2014, 2019 ఎన్నికల్లో పోటీచేసి ఓడిపోయినా పార్టీ ఉనికి కాపాడారు. గతేడాది ఆ పార్టీని వీడి టీడీపీలో చేరారు. మైనారిటీ వర్గాల్లో గట్టి పట్టున్న షాజహాన్ బాషాకు మిగిలిన వర్గాల్లోనూ ఆదరణ వుంది. వ్యక్తిగతంగా మంచిపేరుంది. గత రెండు ఎన్నికల్లో ఓడిపోయిన కారణంగా సానుభూతి కూడా వుంది. వర్గ విభేదాల ప్రభావం ఇతడిపై పడే అవకాశాలు తక్కువ. ఇక పుంగనూరులో చల్లా రామచంద్రారెడ్డిది రాజకీయ నేపథ్యం కలిగిన కుటుంబం. టీడీపీ ఆవిర్భావం నుంచీ పార్టీలోనే కొనసాగుతోంది. తండ్రి రెండు సార్లు పీలేరు ఎమ్మెల్యేగా గెలిచారు. ఈయన 1989లో పీలేరు నుంచీ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై పోటీచేసి ఓటమి చెందారు. 35 ఏళ్ళ సుదీర్ఘ విరామం తర్వాత ఈసారి పుంగనూరు నుంచీ పెద్దిరెడ్డిపై మళ్ళీ పోటీకి దిగుతున్నారు. సొంత మండలం రొంపిచెర్లలో గట్టి పట్టున్న ఇతడికి నియోజకవర్గవ్యాప్తంగా వర్గం, విస్తృత పరిచయాలున్నాయి. జనంలో సానుభూతి కూడా వుంది. చంద్రగిరిలో పులివర్తి నానీ గత ఎన్నికల్లో టీడీపీ తరపున పోటీ చేశారు. ఓటమిచెందినా నియోజకవర్గంలోనే వుంటూ కార్యకర్తలకు, నాయకులకు అండగా నిలిచారు. నిత్యం నియోజకవర్గంలో పర్యటిస్తూ అధికార పార్టీ నేతల అక్రమాలను, ఆగడాలను ఎదుర్కొంటున్నారు. ఈ ఐదేళ్ళలో పార్టీని బలోపేతం చేశారు. శ్రీకాళహస్తిలో బొజ్జల సుధీర్ కుటుంబ నేపథ్యం గురించి ప్రత్యేకంగా చెప్పక్కర లేదు. తాత, తండ్రులు ఎమ్మెల్యేలుగా పనిచేయగా తండ్రి మంత్రిగా కూడా వ్యవహరించారు. నియోజకవర్గ వ్యాప్తం గా బలమైన వర్గం, విస్తృత పరిచయాలున్నాయి. గత ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి చెందిన తర్వాత కొంతకాలం స్థానికంగా లేకపోయినా రెండేళ్ళుగా చురుగ్గా వున్నారు. నియోజకవర్గంలో పర్యటిస్తూ కార్యకర్తలకు అందుబాటులో వుంటున్నారు. వైసీపీ నేతల దౌర్జన్యాలను ఎదుర్కొంటూ శ్రేణులకు అండగా నిలిచారు. వెంకటగిరిలో కురుగొండ్ల లక్ష్మీ సాయిప్రసన్నది కూడా రాజకీయ నేపథ్యం కలిగిన కుటుంబమే. తండ్రి రామకృష్ణ రెండు సార్లు వెంకటగిరి ఎమ్మెల్యేగా పనిచేశారు. నిత్యం శ్రేణులు, ప్రజల మధ్యే వుంటూ మాస్ లీడర్‌గా పేరు పడ్డారాయన. తండ్రి మద్దతు ఆమెకు కొండంత బలం కానుంది. విద్యాధిక యువతి కావడంతో మహిళా వర్గానికి సులువుగా చేరువ కాగలరన్న అంచనా వుంది. ఇక పూతలపట్టులో డాక్టర్ మురళీమోహన్ గతేడాదే అభ్యర్థిగా ఖరారయ్యారు. అప్పటి నుంచే జనంలో వుంటున్న ఆయన నిత్యం గ్రామాల్లో పర్యటిస్తూ శ్రేణులను, ప్రజలను కలుసుకుంటున్నారు. ప్రత్యర్థి పార్టీ అభ్యర్థితో పోలిస్తే ప్రచారం లోనూ, జనంలోకి వెళ్ళడం లోనూ ఎంతో ముందుకు వెళ్ళిపోయారు. ఈ ఆరు స్థానాల సంగతి పక్కన పెడితే ఆదిమూలానికి సత్యవేడు టికెట్ ఇవ్వడం నియోజకవర్గ పార్టీ శ్రేణుల్లో అసంతృప్తిని రగిలించింది.ఆదిమూలం బలమైన అభ్యర్థే అయినా పార్టీ శ్రేణుల కోణంలో ఆయన వైసీపీ నుంచీ వచ్చిన వారు కావడంతో సంపూర్ణ మద్దతు దక్కడం అనుమానంగా మారుతోంది.

టీడీపీ శ్రేణుల సంబరాలు

తాజా ప్రకటనలో సత్యవేడు మినహా మదనపల్లె, పుంగనూరు, పూతలపట్టు, చంద్రగిరి, శ్రీకాళహస్తి, వెంకటగిరి నియోజకవర్గాల్లో పార్టీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నాయి. చంద్రగిరిలో ఆరు మండలాలకు చెందిన కార్యకర్తలు చంద్రగిరి బైపాస్ రోడ్డు ఫ్లైఓవర్ నుంచీ చంద్రబాబు స్వగ్రామమైన నారావారిపల్లి వరకూ భారీ ఎత్తున బైక్ ర్యాలీ జరిపారు. శ్రీకాళహస్తిలో కూడా ఏపీ సీడ్స్ కూడలి నుంచీ ఎన్టీయార్ కూడలి వరకూ కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి ఎన్టీయార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పుంగనూరులో ఎన్టీయార్ కూడలిలో భారీగా బాణాసంచా పేల్చారు. చౌడేపల్లి, పులిచెర్ల, రొంపిచెర్ల మండలాల్లో కూడా పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున సంబరాలు చేసుకున్నారు. మదనపల్లెలో బెంగుళూరు బస్టాండు నుంచీ ప్రారంభమైన బైక్ ర్యాలీ ఎన్టీయార్ కూడలిలో ఎన్టీయార్ విగ్రహానికి పాలాభిషేకం చేసిన అనంతరం నీరుగట్టుపల్లి, గొల్లపల్లి, సీటీఎం రోడ్డుల మీదుగా తిరిగి బెంగుళూరు బస్టాండు చేరుకున్న కార్యకర్తలు సాయంత్రం నుంచీ రాత్రి 9 గంటల వరకూ కూడా భారీ ఎత్తున బాణాసంచా పేలుస్తూనే వున్నారు. పూతలపట్టులో కూడా పార్టీ శ్రేణులు బాణాసంచా పేల్చి ఆనందోత్సాహాలు వ్యక్తం చేశాయి. వెంకటగిరిలో అభ్యర్థి లక్ష్మీ సాయిప్రసన్న పోలేరమ్మ ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. పెద్ద ఎత్తున బాణాసంచా పేల్చారు. సత్యవేడుకు సంబంధించి ఆదిమూలం సొంత మండలం నారాయణవనంలో ఆయన అనుచరులు సంబరాలు జరుపుకున్నారు.



దర్పణంలో జ్ఞానప్రసూనాంబ దర్శనం

అమ్మ అలక చూడతరమా!

● వైభవంగా ఆదిదంపతుల పల్లకిసేవ

శ్రీకాళహస్తి, మార్చి 14: శ్రీకాళహస్తీశ్వరుడి శివరాత్రి ఉత్సవాల్లో గురువారం పల్లకి సేవ వైభవంగా జరిగింది.గంగాదేవిని వివాహమాడాడని తెలిసి అలకబూనిన ఆదిశక్తిని బుజ్జగించేందుకు పరమశివుడు ప్రయత్నించడమే ఈ సేవలో ప్రధానాంశం. తొలుత ఆలయంలోని అలంకార మండపంలో ఉత్సవమూర్తులను అలంకరించి వాహన మండపం వద్ద పల్లకీలలో ఆశీనులను చేసి పురవీధుల్లో ఊరేగించారు. జ్ఞానప్రసూనాంబ దేవి పల్లకిలో ఆశీనురాలై ఎదురుగా వున్న దర్పణంలో భక్తులకు దర్శనమిచ్చారు. సౌందర్య లహరి అయిన ఆదిశక్తి అలకలోనూ అద్వితీయమైన తేజస్సుతో భక్తులకు దర్పణంలో దర్శనమిచ్చారు. కోలాట నృత్యాలు, నిప్పుతో విన్యాసాలు, డ్రమ్స్ వాయిద్యాలు, కేరళవాయిద్యాలు, బ్యాండు, వేషధారణలు, కీలుబొమ్మలు, అశ్వరథం, మహిషాసురమర్థిని రథం, మంగళ వాయిద్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి. శివనామస్మరణతో చతుర్మాడ వీధులు మార్మోగాయి. ఆలయ చైర్మన్ శ్రీనివాసులు,ఈవో నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.శివరాత్రి ఉత్సవాల్లో శుక్రవారం రాత్రి స్వామి, అమ్మవార్లకు ఏకాంత సేవ జరగనుంది. శివరాత్రి ఉత్సవాల సందర్భంగా రద్దు చేసిన ఆర్జిత సేవలు శనివారం నుంచి యథావిధిగా అందుబాటులోకి రానున్నాయి.



పల్లకి సేవలో అశేష భక్తజనం

తిరుపతి జేసీగా ధ్యానచంద్ర

● శాప్ ఎండీగా శుభం బన్సల్



తిరుపతి(కలెక్టరేట్), మార్చి 14: తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్‌గా హెచ్‌ఎం ధ్యానచంద్రను నియమితులయ్యారు.2017 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ధ్యానచంద్ర శాప్ ఎండీగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ జేసీగా పనిచేస్తున్న శుభం బన్సల్ ధ్యానచంద్ర స్థానానికి బదిలీ అయ్యారు. మూడు నెలల వ్యవధిలోనే బన్సల్ బదిలీ కావడం చర్చనీయాంశమైంది.





తిరుపతిలో సమావేశమైన టీడీపీ, జనసేన నేతలు

తిరుపతిలో 'ఆరణి' కుంపటి

కూటమి అభ్యర్థిపై భగ్గుమన్న జనసేన, టీడీపీ నేతలు

పవన్‌కు అయితే ఓకే... లేదంటే స్థానికులకే టికెట్ ఇవ్వాలి...బయటి వారికిస్తే పనిచేయం

జనసేన అధిష్ఠానానికి ఇరుపార్టీల అల్టిమేటం

తిరుపతి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి తరపున తిరుపతి అసెంబ్లీ అభ్యర్థిగా జనసేన నుంచీ చిత్తూరు సిట్టింగ్ వైసీపీ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పేరు ఖరారు కావడంతో తిరుపతిలో టీడీపీ, జనసేన పార్టీల నేతలు భగ్గుమన్నారు. రెండు పార్టీల శ్రేణులు సైతం తీవ్ర నిరుత్సాహానికి లోనయ్యాయి.గురువారం మధ్యాహ్నం నగరంలోని ఒక హోటల్లో అత్యవసరంగా భేటీ అయిన ఇరు పార్టీల నాయకులూ ఈ అంశంపై వాడివేడిగా చర్చించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ తిరుపతిలో పవన్ కళ్యాణ్ పోటీ చేసినా, ఆయన ఎవరికి టికెట్ ఇచ్చినా క్షేత్రస్థాయిలో పనిచేయాల్సింది తామేనన్నారు. తిరుపతిలో పోటీ చేయడానికి పవన్ కళ్యాణ్‌ను ఆహ్వానించారు. ఆయన గెలుపుకోసం శాయశక్తులా కలసి పనిచేస్తామన్నారు. ఆయన కాకుంటే తిరుపతి నియోజకవర్గానికి చెందిన ఎవరికి టికెట్ ఇచ్చినా కష్టపడి గెలుపునకు కృషి చేస్తామన్నారు. అలా కాకుండా తిరుపతి స్థానికుల ఆత్మగౌరవం దెబ్బతీసేలా బయటి వ్యక్తిని అభ్యర్థిగా నిర్ణయిస్తే సహించేది లేదని తేల్చి చెప్పారు. తిరుపతి జనసేన అభ్యర్థిగా ఖరారైన అరణి శ్రీనివాసులు సాంకేతికంగా ఇప్పటికీ చిత్తూరు వైసీపీ ఎమ్మెల్యే అని, అధికార పార్టీలో ఎమ్మెల్యేగా వున్న వ్యక్తికి తిరుపతిలో ఎలా టికెట్ ఇచ్చారని ప్రశ్నించారు. చిత్తూరులో ఆరణి శ్రీనివాసులు అవినీతి, అక్రమాలపై చంద్రబాబు మొదలుకుని లోకేశ్ దాకా బహిరంగసభల్లో ఆరోపణలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. అలాంటి వ్యక్తి గెలుపుకోసం ఇపుడు తామంతా కృషి చేయాలా అని ప్రశ్నించారు. అసలు చిత్తూరులో వైసీపీకే పనికి రాని వ్యక్తి తిరుపతిలో మనకెలా పనికొస్తాడని నిలదీశారు. చిత్తూరులో పనికిరాడనే కదా వైసీపీలో టికెట్ ఇవ్వంది అని ప్రశ్నించారు. జనసేనలో చేరినప్పటికీ శ్రీనివాసులుకు ఇప్పటికీ వైసీపీ ముఖ్యనేతలతో వ్యాపార సంబంధాలు కొనసాగుతూనే వున్నాయని ఆరోపించారు. అతడికోసం పనిచేసేది లేదంటూ మూకుమ్మడిగా తేల్చి చెప్పారు. తిరుపతి నుంచీ పోటీకి పవన్ కళ్యాణ్‌ను ఆహ్వానిస్తున్నామని, ఆయన కాకుంటే స్థానికులకే టికెట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్థానికేతరుడైన అరణి శ్రీనివాసులును కూటమి అభ్యర్థిగా ప్రచారం చేయనివ్వబోమని, అసలు తిరుపతిలోనే అడుగుపెట్టనివ్వబోమని హెచ్చరించారు. టీడీపీ, జనసేన పార్టీల అధిష్ఠానాలు తిరుపతి స్థానికుల ఆత్మగౌరవాన్ని అర్థం చేసుకుని అభ్యర్థి నిర్ణయాన్ని మార్చుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో టీడీపీ ఆశావహుడు ఊకా విజయ్‌కుమార్, టీడీపీ ముఖ్య నేతలు ఆర్సీ మునికృష్ణ, మబ్బు దేవనారాయణ రెడ్డి, పులిగోరు మురళి, జేబీ శ్రీనివాస్, దంపూరి భాస్కర్ యాదవ్, పుష్పావతి యాదవ్, మహేష్ యాదవ్, ఆర్సీ శ్రీనివాసులు, కంకణాల రజనీకాంత్ నాయుడు, ఆనంద్ యాదవ్, జనసేన జిల్లా అధ్యక్షుడు పసుపులేటి హరిప్రసాద్, నియోజకవర్గ ఇంచార్జి కిరణ్ రాయల్, ముఖ్య నేత రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తిరుపతిలో అరణి శ్రీనివాసులు గో బ్యాక్ అంటూ ఫ్లెక్సీలు

గోబ్యాక్ అంటూ ఫ్లెక్సీలు

తిరుపతిలోని పలు ప్రాంతాల్లో జనసేన అభ్యర్థి అరణి శ్రీనివాసులు గోబ్యాక్ అంటూ ఆయన ఫొటో ముద్రించిన ఫ్లెక్సీలు వెలిశాయి. ప్రధాన కూడళ్ళలో వీటిని జనసేన శ్రేణులే ఏర్పాటు చేయడం గమనార్హం.

నేడు ఆరణి తిరుపతి రాక

తిరుపతికి శుక్రవారం ఉదయం ఆరణి శ్రీనివాసులు రానున్నారు.8గంటలకు కపిలతీర్థంలోని సుబ్రమణ్య స్వామి ఆలయంలో పూజలు చేసి తాతయ్యగుంట గంగమ్మ ఆలయానికి చేరుకుని పూజలు చేసి టీడీపీ,జనసేన నేతలను కలవనున్నట్టు తెలిసింది. పలువురు టీడీపీ నేతలను ఫోన్లో సంప్రదించి శుక్రవారం నేరుగా కలిసి మాట్లాడతానని చెప్పినట్టు తెలిసింది.నిజానికి శుక్రవారం తిరుపతిలో స్థానికుల ఆత్మగౌరవ సమావేశం నిర్వహించి, రెండు పార్టీల అధిష్ఠానాలకూ స్థానికుడినే అభ్యర్థిగా నిరణయించమని కోరుతూ స్పష్టమైన సందేశం ఇచ్చేందుకు టీడీపీ, జనసేన నేతలు నిర్ణయించారు.అయితే గురువారం రాత్రి పార్టీల అధిష్ఠానాల నుంచి వచ్చిన సూచనలతో ఈ సమావేశాన్ని వాయిదా వేసుకున్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (శుక్రవారం) : 6.32
సహరి (శనివారం) : 5.02

రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి



గూడూరులో ధర్నా నిర్వహిస్తున్న వామపక్ష నాయకులు

గూడూరు, మార్చి 14: రైతులకు ఇచ్చిన హామీలను కేంద్ర ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని వామపక్ష నాయకులు డిమాండ్ చేశారు. గురువారం టవర్‌క్లాక్ సెంటర్ వద్ద వామపక్షాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ప్రభాకర్, జోగి శివకుమార్, వెంకట్రామిరెడ్డి, కాలేషా, చంద్రయ్య, ప్రసాద్, సురేష్ పోలయ్య, బీవీరమణయ్య తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరి: బీజేపీ ప్రభుత్వం రైతు సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బాలకృష్ణ విమర్శించారు. గురువారం పట్టణంలో సీపీఐ ఆధ్వర్యంలో రైతులకు మద్దతుగా ర్యాలీ చేపట్టారు.

కారల్ మార్క్స్ సేవలు చిరస్మరణీయం

నాయుడుపేట టౌన్, మార్చి 14: కారల్ మార్క్స్ సేవలు చిరస్మరణీయమని సీఐటీయూ నాయకుడు శివకవి ముకుంద అన్నారు. కారల్‌మార్క్స్ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని సుందరరామిరెడ్డి భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఐద్వా నాయకులు చంద్రకళ, విజయలక్ష్మి, ముఠా వర్కర్స్ యూనియన్ నాయకులు వేలు, సుధాకర్, సీఐటీయు నాయకులు ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతిని రాజధానిగా చేయాలి

● కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్



గూడూరులో మాట్లాడుతున్న చింతామోహన్

గూడూరు అర్బన్/వెంకటగిరి/నాయుడుపేట/ సూళ్లూరుపేట, మార్చి 14: తిరుపతిని రాజధానిగా చేయాలని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ డిమాండ్ చేశారు. గురువారం గూడూటవర్‌క్లాక్ కేంద్రం వద్ద కాంగ్రెస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే తిరుపతిని రాజధానిగా చేసేందుకు కృషిచేస్తామన్నారు. జిల్లా అధ్యక్షుడు పంటా శ్రీనివాసులురెడ్డి, నాయకులు పూల చంద్రశేఖర్, భాస్కర్, సుబ్బరామరాజు, వేమయ్య, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు. ● వెంకటగిరి పట్టణంలోనూ ఇదే అంశంపై కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆయన ర్యాలీ నిర్వహించారు. ● నాయుడుపేట అంబేడ్కర్ విగ్రహం వద్ద చింతా మీడియాతో మాట్లాడుతూ.. తిరుపతికి రోడ్డు, జల, వాయు మార్గాలు ఉన్నాయన్నారు. గాడి వెంకటయ్య, చందనముడి శివ, తిలక్ తదితరులు పాల్గొన్నారు. ● నరేంద్ర మోదీ పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదని చింతామోహన్ అన్నారు. సూళ్లూరుపేట బాపూజీ వీధిలో స్థానిక కాంగ్రెస్ నేతలతో కలిసి పర్యటించారు. నాయకులు హరికృష్ణ, భాస్కర్, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

చెంగాళమ్మ హుండీ ఆదాయం రూ.50 లక్షలు

సూళ్లూరుపేట, మార్చి 14: చెంగాళమ్మ ఆలయ హుండీ లెక్కింపును గురువారం దేవదాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. మూడు నెలలకు గాను రూ.49,76,626 ఆదాయం వచ్చిందని సహాయ కమిషనర్ డబ్బు వెంకటేశ్వర్లు తెలిపారు. 78 యూఎస్ఏ డాలర్లు, యుఏఈ దిరహమ్స్ 10, మలేసియాకు చెందిన 2 రింగ్గిట్, కెనడా డాలర్స్ 5, ఇండోనేషియా చెందిన 5,500 రూపాయలు, 70 గ్రాముల బంగారు, 183 గ్రాముల వెండి లభించింది. దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస బాబ, ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ దువ్వూరు బాలచంద్రా రెడ్డి, పాలక మండలిసభ్యులు ముంగర అమరావతి పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యంపై కేసు నమోదు

నాయుడుపేట టౌన్, మార్చి 14: పాత వెంకటగిరివీధికి చెందిన అనిల్ అనే యువకుడు అదృశ్యమైనట్లు అతని తల్లి వెంకటమ్మ ఫిర్యాదు చేసింది. ఈనెల 11వ తేదీన గూడూరుకు వెళ్తున్నానని చెప్పాడన్నారు. అప్పటినుంచి కన్పించక పోవడంతో పోలీసులకు యువకుడి తల్లి ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధి పనులపై దృష్టి సారించాలి

కోట, మార్చి 14: గ్రామాల్లో అభివృద్ధి పనులపై దృష్టి సారించాలని ఎంపీడీవో శంకరయ్య కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పంచాయతీ కార్యదర్శులతో సమీక్షించారు. ఇంటి, కొళాయి పన్నులను ఎప్పటికప్పుడు వసూలు చేయాలన్నారు. నిర్లక్ష్యంగా ఉండే కార్యదర్శులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎన్‌బీకేఆర్‌లో 23న జాతీయ సదస్సు

కోట, మార్చి 14: విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 23వ తేదీన సైన్స్ అండ్ హ్యూమానిటీస్ విభాగం ఆధ్వర్యంలో సృజన 2024 అనే జాతీయస్థాయి సదస్సు జరగనుంది. దీనికి సంబంధించిన వాల్ పోస్టర్లను కళాశాలలో గురువారం ఆవిష్కరించారు. ఈ సదస్సుకు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కర్ణాటక, తమిళనాడు, కేరళలోని పలు ఇంజనీరింగ్ కళాశాలల నుంచి మొదటిసంవత్సరం ఇంజనీరింగ్ చదివే విద్యార్థులు వస్తారని డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. విభాగాధిపతి డాక్టర్ సి.రవీంద్రారెడ్డి, సదస్సు కన్వీనర్ డాక్టర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యాసామగ్రి వితరణ



చిట్టమూరు, మార్చి 14: అరవపాళెం ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు గురువారం శ్రీసిటీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యా సామగ్రి వితరణ చేశారు. ఫౌండేషన్ అధినేత రవి సన్నారెడ్డి ఆదేశాలతో వీటిని విద్యార్థులకు అందజేశామని ఆ సంస్థ ప్రతినిధి ఉద్దారు రాజగోపాల్ తెలిపారు.

అమెరికాలోని భారతీయులకు అండగా పెళ్లకూరువాసి



బినయ శ్రీకాంత్ ప్రధాన్‌తో మాట్లాడుతున్న వెంకటతేజ

పెళ్లకూరు, మార్చి 14: అమెరికాలోని భారతీయ విద్యార్థులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి క్లార్క్ యూనివర్సిటీ ప్రొఫెసర్, పెళ్లకూరుకు చెందిన పేరం వెంకటతేజ చొరవ చూపుతున్నారు. ఇటీవల కౌన్సెలేట్ జనరల్ ఆఫ్ ఇండియాగా ఎంపికైన బినయ శ్రీకాంత్ ప్రధాన్‌తో అమెరికాలోని క్లార్క్ యూనివర్సిటీలో వెంకటతేజ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విద్య, ఉపాధి కోసం భారత్ నుంచి వచ్చినవారు పడుతున్న ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకెళ్లి, పరిష్కరించాలని విన్నవించారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారని వెంకటతేజ తెలిపారు.

బాలమందిరం విద్యార్థి ప్రాణం తీసిన ఈత సరదా



ముని నిరంజన్ (ఫైల్ ఫొటో)

భాకరాపేట, మార్చి 14: చెరువులో ఈతకు వెళ్లిన బాలుడు మృతి చెందినట్లు తిరుపతి వెస్ట్ స్టేషన్ ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు. రేణిగుంట బుగ్గవీధికి చెందిన కె.మునినిరంజన్(10) తిరుపతి ఎస్వీ బాలమందిరం పాఠశాలలో 4వ తరగతి చదువుతున్నాడు. అదే పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న సతీశ్‌తో కలిసి భాకరాపేట పక్కన ఉన్న నల్లపురెడ్డిగారిపల్లెకు బుధవారం వచ్చాడు. ఇంటి వద్ద ఎవరూ లేకపోవడంతో పక్కనే ఉన్న పేటచెరువులో ఈతకు వెళ్లారు. ముందుగా ముని నిరంజన్ నీటిలోకి వెళ్లి పైకి రాకపోవడంతో సతీశ్ వెనక్కు వచ్చి ఎవరికీ చెప్పకుండా ఉండిపోయాడు. సాయంత్రం మునినిరంజన్ ఇంటికి రాకపోవడంతో అతడి తల్లి స్వాతి విచారించగా ముని నిరంజన్ భాకరాపేటలో బస్సు ఎక్కి వచ్చేశాడని తెలిపాడు. దీంతో స్వాతి వెస్ట్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు సతీశ్‌ను విచారించగా మునినిరంజన్ నీటిలో మునిగిపోయినట్లు అంగీకరించాడు. రాత్రి కావడంతో గురువారం ఉదయం పోలీసులు అగ్నిమాపక సిబ్బందితో గాలింపు చేపట్టి బురదలో కూరుకుపోయిన మునినిరంజన్ మృతదేహాన్ని వెలికితీశారు. స్వాతి ఇచ్చిన ఫిర్యాదు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పీలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

వైసీపీలో బయటపడ్డ లుకలుకలు



ఇంటి పట్టాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న నేతలు

గూడూరు అర్బన్, మార్చి 14: సబ్‌కలెక్టర్ కార్యాలయంలలో ఆవరణంలో గురువారం లబ్ధిదారులకు ఇంటి పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైసీపీలో లుకలుకలు బయటపడ్డాయి. ఈ కార్యక్రమానికి జడ్పీటీసీ సభ్యురాలు వూటుకూరు యామినిని ఆహ్వానించలేదని ఆమె భర్త మహేంద్రరెడ్డి సభావేదికపై బహిరంగంగా మున్సిపల్ కమిషనర్‌తో వాగ్వాదానికి దిగాడు. దీంతో ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో వైసీపీలో వర్గవిభేదాలు బయటపడ్డాయన్న గుసగుసలు వినిపించాయి. దీనిపై మహేంద్రరెడ్డి మాట్లాడుతూ.. ప్రొటోకాల్ పాటించకుండా కార్యక్రమాన్ని నిర్వహించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్‌పర్సన్ పొణకా దేవసేనమ్మ, ఆర్డీవో కిరణ్‌కుమార్, తహసీల్దారు కరుణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, నాయకులు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, మల్లు విజయ్‌కుమార్‌రెడ్డి, చేవూరు విజయ్‌మోహన్‌రెడ్డి, బాబురెడ్డి, మహేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జనసేన ఆవిర్భావ దినోత్సవం



గూడూరు, మార్చి 14: జనసేన కార్యాలయంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఉమ్మడి నెల్లూరుజిల్లా ఉపాధ్యక్షుడు తీగల చంద్రశేఖర్ మాట్లాడుతూ.. అరాచక వైసీపీ ప్రభుత్వాన్ని కూల్చేందుకు టీడీపీ, బీజేపీతో పవన్‌కళ్యాణ్ పొత్తుపెట్టుకోవడం జరిగిందన్నారు. మోహన్, ఇంద్రవర్ధన్, సనత్, సాయికిరణ్, అవినాష్, విష్ణువర్ధన్,అనుదీప్, మురళి, శంకర్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

వెంకటగిరి అభివృద్ధికి కృషి చేస్తా

పోలేరమ్మ సేవలో టీడీపీ అభ్యర్థి లక్ష్మీ సాయిప్రియ

వెంకటగిరి, మార్చి 14: వెంకటగిరి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల లక్ష్మీ సాయిప్రియ అన్నారు. గురువారం టీడీపీ అధిష్ఠానం వెంకటగిరికి తన పేరును ఖరారు చేయగానే ఆమె తన తండ్రి మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, పార్టీ శ్రేణులతో కలిసి ప్రదర్శనగా వెళ్లి గ్రామశక్తి పోలేరమ్మను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడారు. కురుగొండ్ల వారసురాలిగా అధిష్ఠానం తన పేరును ప్రకటించినట్లు తెలిపారు. వెంకటగిరి ఆడపడుచుగా తనను ఆశీర్వదించాలని కోరారు. పార్టీలో అందరినీ కలుపుకుని ముందుకెళతానని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు బాణాసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం స్వగృహానికి వచ్చిన ఆమెను టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంగోటి నాగేశ్వరావు సత్కరించారు.

నా బిడ్డను ఆదరించండి: కురుగొండ్ల : 'నా బిడ్డ లక్ష్మీ సాయి ప్రియను నన్ను ఆదరించినట్లే ఆశీర్వదించి అసెంబ్లీకి పంపించండి' అని వెంకటగిరి నియోజకవర్గ ప్రజలకు మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ విజ్ఞప్తి చేశారు. గురువారం రాత్రి పుట్టింటికి వచ్చిన ఆమెను తన సహచరులకు పరిచయం చేశారు.

పలువురి హర్షం: లక్ష్మీ సాయి ప్రియకు టికెట్ ఇవ్వడంపై పలువురు టీడీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. వీరిలో.. మండల అధ్యక్షుడు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, మాజీ జడ్పీటీసీ సభ్యులు ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు, మాజీ ఎంపీపీ పోలంరెడ్డి వెంకటరెడ్డి, ఆస్పత్రి సలహా కమిటీ మాజీ చైర్మన్ చెలికం భాస్కరరెడ్డి తదితరులున్నారు.





టీడీపీ శ్రేణులు, కురుగొండ్ల రామకృష్ణతో ప్రదర్శనగా వచ్చి పోలేరమ్మను దర్శించుకున్న లక్ష్మీ సాయిప్రియ

టీడీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి: గంగాప్రసాద్



టీడీపీ నేతలతో మాట్లాడుతున్న గంగా ప్రసాద్

వెంకటగిరిలో టీడీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పార్టీ నేతలను పారిశ్రామిక వేత్త గంగాప్రసాద్ కోరారు. తన కోడలు లక్ష్మీ సాయి ప్రియను వెంకటగిరి అభ్యర్థిగా ప్రకటించడంతో గురువారం టీడీపీ ముఖ్య నేతలతో తనింట్లో సమావేశమయ్యారు. కొన్ని పరిస్థితుల కారణంగా లక్ష్మీ సాయి ప్రియను పార్టీ ఎంపిక చేసిందని వివరించారు. ఇప్పటికే వైసీపీ ప్రభుత్వంపై ప్రజలు విసిగిపోయి ఉన్నారని, ప్రతి అవకాశాన్నీ సద్వినియోగం చేసుకుని టీడీపీ గెలుపునకు కృషి చేయాలని కోరారు. కష్టపడి పనిచేసిన వారికి తగిన గుర్తింపు పార్టీలో ఎప్పుడూ ఉంటుందని స్పష్టం చేశారు.

రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం: నెలవల

నాయుడుపేట టౌన్, మార్చి 14: వైసీపీ పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందని సూళ్లూరుపేట టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. రాష్ట్రాభివృద్ధి జరగాలంటే చంద్రబాబు సీఎం అయితేనే సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. పెళ్లకూరు మండలం శిరసనంబేడు గ్రామానికి చెందిన 20 మంది వైసీపీ కార్యకర్తలు గురువారం టీడీపీలోకి చేరారు. వీరందరికీ తెలుగు రైతు నేత శివకోటేశ్వరరెడ్డితో కలిసి టీడీపీ కండువాలు కప్పి, పార్టీలోకి ఆహ్వానించారు. సూళ్లూరుపేట టీడీపీ అభ్యర్థి నెలవల విజయశ్రీని అఖండ మెజార్టీతో గెలిపించి సూచించారు. టీడీపీ నాయకులు సంచి కృష్ణయ్య, గుంటపూడి రమణయ్య, మునులూరు రామచంద్రారెడ్డి, దాసరి వెంకటకృష్ణయ్య, ప్రసాద్‌నాయుడు, పరుశురామ్, జనసేన నాయకులు కామిరెడ్డి కేశవరెడ్డి, గోపీ, రమేష్‌రెడ్డి, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు. కాగా.. నాయుడుపేట పట్టణంలోని చంద్రబాబుకాలనీలో గురువారం రాత్రి పాస్టర్ ఎస్.వినయ్‌కుమార్ ఆధ్వర్యంలో క్రైస్తవులతో జరిగిన సమావేశంలో సూళ్లూరుపేట టీడీపీ అభ్యర్థి విజయశ్రీ ప్రసంగించారు. వైద్య వృత్తిని వదిలి ప్రజాసేవ కోసం వచ్చానని ప్రతి ఒక్కరూ ఆశీర్వదించాలని కోరారు. టీడీపీ నాయకులు నెలవల రాజేష్, చక్రపాణి, సుజాతమ్మ, శ్రీనివాసులు, ముత్యాలయ్య, పసల సురేష్, తదితరులు పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన వైసీపీ కార్యకర్తలతో నెలవల సుబ్రహ్మణ్యం



విజయశ్రీతో గున్నం సేవా ట్రస్ట్ అధినేత మధురెడ్డి తదితరులు

గున్నం సేవాట్రస్ట్ అధినేతను కలిసి విజయశ్రీ

ఓజిలి: భట్లకనుపూరులోని గున్నం సేవా ట్రస్ట్ అధినేత మధురెడ్డిని సూళ్లూరుపేట టీడీపీ అభ్యర్థి నెలవల విజయశ్రీ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. నెలవల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పలువురు నాయకులతో కలిసి మధురెడ్డితో భేటీ అయ్యారు. ఎన్నికల్లో మద్దతు ఇవ్వాలని కోరారు. నాయుడుపేట ఏఎంసీ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ రఫీ, స్థానిక నాయకులు రవీంద్రరెడ్డి, ధనుంజయ, శ్రీనివాసులు, నాయుడుపేట, పెళ్లకూరు మండలాలకు చెందిన పలువురు నాయకులున్నారు.

వలంటీర్ల భవిష్యత్తుకు బంగారుబాటలు వేస్తాం: టీడీపీ



టీడీపీలో చేరిన నాయకులతో పాశం సునీల్‌కుమార్

కోట, మార్చి 14: వలంటీర్ల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తామని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక వలంటీర్లను తొలగిస్తామన్న దుష్ప్రచారాన్ని నమ్మొద్దని, ఎన్నికల్లో నిజాయితీగా పనిచేయాలని కోరారు. మండల పరిధిలోని జరుగుమల్లిలో గురువారం మాజీ సర్పంచ్, మాజీ సాగునీటి సంఘం అధ్యక్షుడు ఉచ్చూరు రవీంద్రనాథ్‌రెడ్డితోపాటు 60 కుటుంబాల నాయకులు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వీరందరికీ టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పాశం మాట్లాడుతూ.. వైసీపీ పాలనలో తమవారిపై అక్రమ కేసులుపెట్టినా భయపడకుండా ప్రజల్లోకి వచ్చామని, ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రం అభివృద్ధి పథంలో నడవాలంటే చంద్రబాబును సీఎం చేసుకోవాలని చెప్పారు. మండల అధ్యక్షుడు సర్వోత్తమరెడ్డి, మైనార్టీసెల్ జిల్లా అధ్యక్షుడు జలీల్ అహ్మద్, నాయకులు భాస్కర్‌రెడ్డి, బిల్లు చెంచురామయ్య, మోహన్‌రెడ్డి, మురళీ, దశరథరామిరెడ్డి, రాధాకృష్ణారెడ్డి, వెంకటకృష్ణయ్య, మధుయాదవ్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి మారుపేరు టీడీపీ: పాశం

చిల్లకూరు, మార్చి 14: అభివృద్ధికి మారు పేరు తెలుగుదేశం పార్టీయేనని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. గురువారం పారిచెర్లవారిపాళెంలో శంఖారావం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. వైసీపీ పాలనలో రాష్ట్రాభివృద్ధి కుంటుపడిందన్నారు. రోడ్లన్నీ అధ్వానంగా మారాయన్నారు. గాడితప్పిన రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించే సత్తా చంద్రబాబుకే ఉందన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే అన్ని వర్గాల ప్రజలకు సముచిత న్యాయం చేస్తుందన్నారు. రానున్న ఎన్నికల్లో ఉమ్మడి ప్రజాప్రభుత్వాన్ని గెలిపించుకోవాలన్నారు. సన్నారెడ్డి వెంకటరమణారెడ్డి, ప్రదీప్‌కుమార్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, కరిముల్లా, వెంకటేశ్వర్లురెడ్డి, గుండాల లీలావతి, సరపూరు నాగేశ్వరరావునాయుడు, కీరవాణి, మునిశేఖర్‌గౌడ్, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, వెంకటేశ్వర్లునాయుడు, శంకరయ్య, వెంకటకృష్ణయ్య, కుమార్‌యాదవ్, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

అన్నివర్గాలను మోసం చేసిన వైసీపీ

గూడూరు: ఒక్క చాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన వైసీపీ అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ సతీమణి సంధ్యారాణి అన్నారు. గురువారం వాములమిట్ట ప్రాంతంలో బాబుష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పిళ్లెళ్ల శ్రీనివాసులు, శ్రీదేవి, పేటేటి వెంకటేశ్వర్లు, పేటేటి ప్రకాష్, పులిమి శ్రీనివాసులు, నరసింహులు, జనార్ధన్‌రెడ్డి, మట్టం శ్రావణి, వెంకటేష్, చిరంజీవి, నాగేంద్ర, సన్నీ, తేజ, అశోక్, శ్రీకాంత్, కార్తీక్, విజయ్, రవిరెడ్డి, భారతి, కల్పన తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ జాతరను వేడుకగా నిర్వహిద్దాం: ఆర్డీవో



సమావేశంలో ప్రసంగిస్తున్న ఆర్డీవో కిరణ్‌కుమార్

చిల్లకూరు, మార్చి 14: తూర్పుకనుపూరులోని ముత్యాలమ్మ జాతరను వేడుకగా నిర్వహిద్దామని ఆర్డీవో కిరణ్‌కుమార్ అన్నారు. తూర్పుకనుపూరులో అన్నిశాఖల అధికారులతో జాతర నిర్వహణపై గురువారం సమీక్షించారు. ఏప్రిల్ రెండు నుంచి ఐదో తేదీవరకు జాతరను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా చర్యలు చేపడుతున్నామన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని వసతులను కల్పించడం జరుగుతుందన్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి రానుండటంతో నియమావళిని అనుసరించి జాతర నిర్వహించేలా చూస్తామన్నారు. ఆలయ కమిటీ చైర్‌పర్సన్ ఇంద్రసేనమ్మ, దువ్వూరు చంద్రశేఖర్‌రెడ్డి, డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి, తహసీల్దారు శ్రీనివాసులు, సీఐ వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీడీవో భానుమూర్తిరావు, ఈవో నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఈబీసీ నేస్తం నిధుల జమ

జిల్లాలోని లబ్ధిదారుల ఖాతాల్లోకి రూ.26.14కోట్లు



లబ్ధిదారులకు నమూనా చెక్కు అందజేస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 14: వైఎస్సార్ ఈబీసీ నేస్తం పథకం కింద మూడవ విడతలో జిల్లాలోని 17,428మంది లబ్ధిదారుల ఖాతాల్లో రూ.26.14కోట్లు జమ చేసినట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. గురువారం సీఎం జగన్ బనగానపల్లె నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించగా కలెక్టరేట్ నుంచి కలెక్టర్, సంబంధిత అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం లబ్ధిదారులకు నమూనా చెక్కు అందజేశారు. బీసీ కార్పొరేషన్ ఏఈవో బాబురెడ్డి, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి భాస్కర్‌రెడ్డి, సహాయ బీసీ సంక్షేమ అధికారులు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

400 మొబైల్ ఫోన్ల రికవరీ

తిరుపతి (నేరవిభాగం), మార్చి 14 : తిరుపతి జిల్లా పరిధిలోని పలు ప్రాంతాల్లో అపహరణకు గురైన దాదాపు రూ.72 లక్షల విలువ చేసే 400 మొబైల్ ఫోన్లను పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ తన ఛాంబర్‌లో వాటిని బాధితులకు అందజేశారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ ఏడాది కాలంలో 8 విడతల్లో 2,630 సెల్ ఫోన్లను రికవరీ చేసినట్లు చెప్పారు. ఫోన్లను రికవరీ చేయడంలో ప్రతిభ కనబరిచిన సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్ వినోద్‌కుమార్, సిబ్బందిని ఎస్పీ అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు వెంకట్రావు, డీఎస్పీ భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న మొబైల్స్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్ పటేల్

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం: ముగ్గురికి గాయాలు



బస్సు కిందకు దూసుకెళ్లిన కారు

చిల్లకూరు, మార్చి 14: ఆగి ఉన్న బస్సును వెనుక నుంచి కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం చెందగా, మరో ముగ్గురు గాయపడ్డారు. చిల్లకూరు మండలంలోని బూదనం టోల్‌ప్లాజా సమీపంలో గురువారం వేకువ జామున ఈ ప్రమాదం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గిద్దలూరు నుంచి చెన్నైకి వెళుతున్న ఆర్టీసీ బస్సు టైరు పంక్చర్ కావడంతో టోల్‌ప్లాజా సమీపంలో రోడ్డు పక్కన ఆపారు. తర్వాత పంక్చర్ వేయడానికి బస్సు వెనుక రాళ్లు పెడుతుండగా.. తాడేపల్లిగూడెం నుంచి చెన్నైకి వెళుతున్న ఓ కారు అదుపుతప్పి ఆగి ఉన్న బస్సును వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సు వెనుక రాళ్లు పెడుతున్న ప్రకాశం జిల్లా బెస్తవారిపేట ప్రాంతానికి చెందిన డ్రైవర్ మలన్‌షా వల్లీ(52), కారులో డ్రైవర్ పక్కన కూర్చొని ఉన్న తాడేపల్లిగూడెంకు చెందిన సుదర్శన్‌రావు(68) అక్కడికక్కడే మృతి చెందారు. కారు డ్రైవర్ రామచంద్రరావు, సుదర్శన్‌రావు భార్య పద్మావతి, కుమార్తె అనురాధలకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు గాయపడిన వారిని చికిత్స నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో బాధితులను ఆర్డీవో కిరణ్‌కుమార్ పరామర్శించారు. కాగా, సుదర్శన్‌రావు తన కుమార్తెకు వైద్యపరీక్షలు చేయించడానికి కారులో చెన్నైకి వెళుతుండగా ఈ ప్రమాదం జరిగిందని కుటుంబీకులు తెలిపారు. ఎస్ఐ అంజిరెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.





బస్సు డ్రైవర్ డీఎం వల్లీ, కారులో సుదర్శన్‌రావు మృతదేహాలు

మాజీ కమిషనర్‌పై విజిలెన్స్ విచారణ జరపాలి

కౌన్సిలర్ల డిమాండ్






సమావేశంలో ప్రసంగిస్తున్న కమిషనర్ రషీద్, వేదికపై చైర్‌పర్సన్ భానుప్రియ - ప్రశ్నిస్తున్న కౌన్సిలర్ జానకిరామయ్య

వెంకటగిరి టౌన్, మార్చి 14: మాజీ మున్సిపల్ కమిషనర్ బీవీ రమణయ్యపై విజిలెన్స్ విచారణ జరిపించాలని కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ అధ్యక్షతన గురువారం కౌన్సిల్ బడ్జెట్ సమావేశం నిర్వహించారు. ఆరో వార్డు కౌన్సిలర్ జానకిరామయ్య మాట్లాడుతూ.. కౌన్సిల్ ఆమోదం లేకుండా మాజీ కమిషనర్ రూ.70లక్షలు మింగేశారని ఆరోపించారు. నూతన కమిషనర్ బాధ్యతలు తీసుకున్నాక కూడా మున్సిపల్ కార్యాలయంలో చొరబడి ఫైల్స్ కాల్చేశారని విమర్శించారు. ఆయనపై విజిలెన్స్ విచారణ చేయించాల్సిందేనని కౌన్సిలర్లంతా కలిసి కమిషనర్‌కి అర్జీని అందించారు.

ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం: 14వ వార్డు కౌన్సిలర్ శంకరయ్య మాట్లాడుతూ.. కోట్లాది రూపాయల ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్న పాలవర్గం పట్టించుకోకపోవడం సిగ్గుచేటుగా ఉందన్నారు. మున్సిపాలిటీలో అనుమతులు రాకుండా పెద్ద పెద్ద భవంతులు కడుతున్నారని ధ్వజమెత్తారు. 9వ వార్డు కౌన్సిలర్ కల్యాణి మాట్లాడుతూ.. ఎస్‌సీ కాలనీలో నీటి ఎద్దడితోపాటు పలుచోట్ల వీధిదీపాలు లేవని చెప్పారు.


ఉద్యోగాల నియామకంలో భారీ అవినీతి: టీడీపీ



టీడీపీ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న టీడీపీ నాయకులు

గూడూరు, మార్చి 14: వైసీపీ ప్రభుత్వం ఏపీపీఎస్సీ ఉద్యోగాల నియామకంలో భారీ అవినీతికి పాల్పడిందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నెలబల్లి భాస్కర్ రెడ్డి అన్నారు. దీనికి కారణమైన సీఎం జగన్‌రెడ్డి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక టీడీపీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డిప్యూటీ కలెక్టర్ పోస్టును రూ.2.50 కోట్లకు, డీఎస్పీ పోస్టును రూ.1.50 కోట్లకు అమ్ముకున్నారని ఆరోపించారు. ఈ ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని కోరారు. వెంకటేశ్వర్లురాజు, రవీంద్రరెడ్డి, అమరేంద్ర, శ్రీనివాసులురెడ్డి, కృష్ణారెడ్డి, సురేంద్ర, కళ్యాణ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇరకందీవిలో పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న శిక్షణ ఎస్పీ దేవరాజ్ మనీష్‌పాటిల్

తడ, మార్చి 14: ఇరకం దీవిలోని పోలింగ్ కేంద్రాలను శిక్షణ ఎస్పీ దేవరాజ్ మనీష్‌పాటిల్ పరిశీలించారు. గురువారం గ్రామానికి వెళ్లిన ఆయన పోలింగ్ కేంద్రంలోని వసతులు, శాంతి భద్రతలపై ఆరా తీశారు. శాంతీయుతంగా పోలింగ్ జరిగేందుకు గ్రామస్తులు సహకరించాలని కోరారు. ఆయనతోపాటు ఎస్ఐ నరసింహరావు కూడా ఉన్నారు.

పెళ్లకూరు: మండలంలోని తాళ్వాయిపాడు, శిరసనంబేడు, పుల్లూరు, పెళ్లకూరు తదితర గ్రామాలోని పలు పోలింగ్ బూత్‌లను నాయుడుపేట డీఎస్పీ శ్రీనివాసులురెడ్డి గురువారం పరిశీలించారు. నాయుడుపేట రూరల్ సీఐ జగన్మోహనరావ్, స్థానిక ఎస్ఐ శ్రీకాంత్ తదితరులున్నారు.

ఎన్నికల నిర్వహణపై ఆర్వో సమీక్ష

సూళ్లూరుపేట, మార్చి 14: ఆర్డీవో కార్యాలయంలో వివిధ పార్టీ నాయకులు, అధికారులతో ఎన్నికల నిర్వహణపై ఆర్వో (ఆర్డీవో) చంద్రముని గురువారం సమీక్షించారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు అందరూ సహకరించాలని కోరారు. సమస్యాత్మక గ్రామాలపై దృష్టి సారించాలని సిబ్బందిని ఆదేశించారు. సూళ్లూరుపేట, తడ, దొరవారిసత్రం, నాయుడుపేట తహసీల్దార్లు కేవీ.గోపాల కృష్ణ, ఇక్బాల్, గోపినాథ్ రెడ్డి, కల్యాణి, సూళ్లూరుపేట మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో మెరుగైన వసతులుండాలి

డక్కిలి: పోలింగ్ కేంద్రాల్లో మెరుగైన వసతులు కల్పించే దిశగా బీఎల్‌వోలు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ శ్రీనివాస్ యాదవ్ ఆదేశించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారికి పలు సూచనలిచ్చారు. ఎంపీడీవో లీలామాధవి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బలగాల కవాతు



కోట: ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక గ్రామాలైన కేశవరం, రాఘవాపురంలో గురువారం కేంద్ర బలగాల కవాతు నిర్వహించారు. వాకాడు సీఐ హరికృష్ణ, కోట ఎస్ఐ నాగబాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని ప్రజలకు సూచించారు.